


సెప్టెంబరు
1977

71

సృజన



సృజన

మాస పత్రిక

71

సెప్టెంబర్ **1977**

లాల్ సలామ్ !

పంచాది నిర్మలవలె
నీ ఊరే ప్రజాపోరు
నీ రక్తం తరంగాల
ఊపిరులే ఉద్యమాలు
త్యాగాల చాలుబోసి
ధన్యత నొందిన తల్లీ
చెల్లీ ఓ స్నేహలతా
అందుకో **లాల్** సలామ్!

— వి. బి. గద్దర్.

నిర్వహణ

సాహితీ మిత్రులు

సంవత్సర చందా : **15** రూపాయలు — విడి ప్రతి :
ఆరునెలల చందా : **8** రూపాయలు — రూ. **1-50**

సృజన

ఆధునిక సాహిత్యవేదిక

సెప్టెంబర్ 1977 మాస పత్రిక 71

అక్టోబర్ ప్రత్యేక సంచిక వెల 2 రూపాయలు

అక్టోబర్ 1 జనచైనా విముక్తిదినం. సెప్టెంబర్ 11న కామ్రేడ్ మావో సే - టుంగ్ ప్రథమ వర్ధంతి. ఈ సందర్భంగా చైనా విప్లవంలో సాహిత్య - సంస్కృతుల పాత్రగురించి సాహిత్య కళారంగాలపై మావో ఆలోచనల గురించి, కవిగా మావో గురించి ప్రత్యేక రచనలుంటాయి. అక్టోబర్ సంచిక కావల్సిన వ్యక్తులు, సంస్థలు, ఏజంట్లు తమకు కావలసిన కాపీలకు 25% కమీషన్ మినహాయించుకొని సెప్టెంబర్ 15 నాటికే డబ్బు పంపితే తప్ప కాపీలు అందవు.

ఆమె

—శివసాగర్

జీవితం
మనల్ని ప్రేమించిన చోట
జీవితం పేరిట
మరణం
విజయాల్ని సాధించిన చోట
ఆమెను చూశాను

ఉరి కంబాలకు
వేళ్లాడుతోన్న
విప్లవ యోధుల్ని
చిరంజీవులని పేరుపెట్టి
ఆమె పిలిచినపుడు
ఆమె గొంతు విన్నాను

ఓహో ! ఆ దివ్యానుభూతిని
నాతోటి ఖైదీలతో
నేడు పంచుకుంటున్నాను
రేపటి విజయోత్సవాన్ని
నేడే జరుపుకుంటున్నాను

ఆమె
అవనీ మాత
అరుణారుణ చరిత.

సంపాదకీయం :

బొమ్మారెడ్డి స్నేహలత

ప్రజలో పోరాట ఆకాంక్ష వసంతిస్తున్నవేళ, జీవితలత స్నేహం వికసిస్తున్నవేళ, ప్రకృతిలోనూ, బొమ్మారెడ్డి స్నేహలత జీవితంలోనూ, శిశిరమే రుతువయింది. స్నేహలతను మానుకోట ప్రాంతంలో మేతరాజపల్లి, ఎర్రబెల్లి గూడెం గ్రామాల మధ్యన పట్టుకొని కాల్చివేశారు పోలీసులు - ఎమర్జెన్సీ కన్న ఆరునెలల ముందే 1975 జనవరి 7న. అప్పటికామె వయస్సు 25 వసంతాలు.

స్నేహలత చదివింది ప్రకృతి శాస్త్రం—సమాజ శాస్త్రం (బి.ఎస్సీ., ఎం. ఎ. ఆంధ్ర పాలజీ) ఆచరించినదీ ప్రకృతిలోనూ, సమాజంలోనూ మార్పు సహజమని, సంఘర్షణ అనివార్యమనీ గ్రహించిన శాస్త్రీయ సత్యాన్ని. ఆమెలో ప్రకృతి వుంది అది లత, అది సాహిత్యం, ఆమెలో స్నేహం వుంది. అది ప్రజలపట్ల అందుకే పోరాటం ఆమె చచ్చు చదువులపై రాసింది; కుహనా ఆదర్శాలపై రాసింది. స్త్రీల సమస్యలపై రాసింది చేదు జీవిత సత్యాలపై రాసింది. జీవితాన్ని రాసింది. జీవితాన్ని ఒకయువ ఆదర్శ త్యాగశీలి చూసిన ఆలోచనలతో రాసింది ఆమె సైంటిస్ట్ కావాలని సైన్స్ చదువలేదు. సామాజిక శాస్త్రవేత్త కావాలని సమాజశాస్త్రం చదువలేదు. రచయిత కావాలని సాహిత్య సృష్టి చేయలేదు- సత్యం, సమానత్వం, ప్రేమ వెల్లివిరిసే దోపిడీ లేని సమాజం కోసం తానేం చేయగలనన్న అన్వేషణలో ఆమె ఆచరణ రంగాన్ని ఎంచుకున్నది. ఒక అలవలె, ఒక కలవలె పోరాటప్రవాహంలో సంలీనమైంది. పోరాటమూ, ప్రవాహమూ నిరంతర స్రవంతి. పోరాట లతలు వికసించినంత కాలం, శ్రామిక స్నేహభావం, సమాజం లోనూ, సాహిత్యంలోనూ గుబాళించినంత కాలం స్నేహలత మనమధ్య సజీవ చైతన్య స్పందన.

వెంగళరాయుని 'ప్రజాస్వామ్య' ఆస్థాన పీఠంపై 'అభ్యుదయాధ్యక్షుడు'

'మా నిజాము రాజు తరతరాల బూజు' అని నిజాం నిరంకుశ పాలననేకాదు 'తరతరాల బూజు' అనే మాటలో రాజరికాన్ని సైతం, రాటరికం రోజుల్లోనే రోసిన దాశరధి 'ప్రజాస్వామ్య' ప్రభుత్వానికి ఆస్థానకవి అయ్యాడు. 'ఆధునిక కవీ, తమ అధ్యక్షవర్గ సభ్యుడూ, అయిన దాశరధి మొదటిసారిగా ఆస్థానకవి' అయినందుకు ఆనందించింది, అభినందించింది అభ్యుదయ రచయితల సంఘం.

'కవిగా దాశరధికి, సంస్థగా అభ్యుదయ రచయితల సంఘానికి చరిత్ర లేకపోతే ప్రపంచ వ్యాప్తంగా ఇది ప్రజా పోరాటాల యుగం కాకపోతే ఇందులో పట్టించుకోవలసిందిగానీ, వేలుపెట్టి చూపవలసిందిగానీ ఏమీలేదు. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి ఆస్థాన కవిత్వాలు చెప్పాడు. శ్రీపాద కృష్ణమూర్తి, కాశీ కృష్ణాచార్యులు మనుధర్మమే మానవధర్మమనుకున్న వాళ్ళు, విశ్వనాథ సత్యనారాయణ సంగతి సరేసరి. శిథిలమై పోతున్న ఫ్యూడల్ వ్యవస్థ వేయి పడగలను పునరుద్ధరించాలని జీవితమంతా పోరాడినవాడు. వాళ్ళు గతంలో ఆస్థాన కవులు.

దాశరధి అగ్నిధార, రుద్రవీణ నిజాం నిరంకుశ రాజరిక పాలనకు వ్యతిరేకంగా రచించిన కావ్యాలు. నిజాం నిరంకుశ వ్యతిరేక పోరాటంలో ఆయన పాల్గొన్నాడు. జెయిలుపాలయ్యాడు. అభ్యుదయ రచయితల సంఘం తెలంగాణాలో ఫ్యూడల్ వ్యతిరేక పోరాటంలో నిర్వహించిన సాహిత్య, సాంస్కృతిక పాత్ర గురించి చరిత్ర రక్తాక్షరాలతో రచించుకుంది. విశాలాంధ్ర భావనకేకాదు, విశాలాంధ్రలో ప్రజా రాజ్య భావనకు సాంస్కృతిక దోహదం చేసిన సంస్థ నాటి అరసం.

అరసంలో అభ్యుదయం గతమైపోయింది.

దాశరధికి వెంగళరావు ముఖ్యమంత్రిత్వ లోచనాల్లో ఆలోచనలు కనిపించినవి. ఇందిరా వెంగళరావు ఫాసిస్టు పాలనలో ప్రజాస్వామ్యం - సామ్యవాదం ప్రతి బింబించింది. దాశరధి 'తిమిరంతో సమరం' కాదు సమరం నుంచి తిమిరంలోకి వెళ్ళిపోయాడు. అందువల్లనే అసంబద్ధమైన సామాజిక, శాస్త్రీయ - అజ్ఞానాన్ని ప్రదర్శిస్తున్నాడు. తనకు ప్రజాస్వామ్య సామ్యవాదంలో విశ్వాసం వుందని, హింసకు తాను వ్యతిరేకినని 'ఆస్థానకవి' అయ్యాక ఆంధ్రజ్యోతి ప్రతినిధితో చెప్పాడు. రాజ్యాంగ యంత్రం హింసను అమలుపరుస్తుందని. అందునా ఈనాటి ఆంధ్ర రాజ్యాధినేత జలగం వెంగళరావు ఐదువందలకు పైగా ప్రజల హత్యలకు బాధ్యుడని తెలుగు దేశమంతా నెత్తిన నోరుపెట్టుకొని ఆందోళన చేస్తున్న కాలంలో ఇది ధూర్త వాక్యమా, అమాయకత్వమా? పాణిగ్రాహి, తామాడ చినబాబు, పరిటాల శ్రీరాములు, స్నేహలతవంటి కళాకారుల, రచయితల రక్తంతో పంకిలమైన వెంగళరాయని 'ప్రజాస్వామ్య' ఆస్థాన కవి పీఠాన్ని అలంకరిస్తున్న దాశరధి 'ముసలి నక్కకు రాచరికమ్ము దక్కునే' అని గర్జించిననాడు ముసలి నిజాము రాజు రాజరికానికి పనికిరాడు కాని వయసు వెంగళరావు పనికొస్తాడనే భావంతోనే అన్నాడని, ఆయన నిజాముకు వ్యతిరేకమేకాని, రాజరికానికి వ్యతిరేకం కాదని ఇవ్వాళ తాత్పర్యం చెప్పుకుంటే పేచీలేదు.

ఎమర్జెన్సీనిగాని, ఇందిర - వెంగళరావులనుగానీ ఎలుగెత్తి బలపరచిన కవులు ఎందరో వుండగా ఆంధ్ర ఆస్థాన కవీశ్వర పదవి దాశరథినే ఎందుకు వరించింది ? ముఖ్య మంత్రులకూ, అధికారంలో వున్నవారికీ కావ్యాలను అంకితం చేయడంలో తక్కిన అందరికన్నా ముందు మేల్కొన్న సమయజ్ఞుడు దాశరథి. 'ప్రపంచ తెలుగు మహాసభలు' భారాన్నంతా సినారెయే మోసినట్లు కనిపించినా అది తెలుగువాళ్ళ అందరిదీ పండుగ అని, దానికి రానివాని 'బ్రతుకే ఒక దండుగ' అనీ మండలి కృష్ణారావుకన్నా వీరావేశంతో చెప్పి వెంగళరావును 'మన ప్రియతమ నాయకుడు జలగం, ప్రజాకోటియే ఆయన బలగం' అని బల పరచినవాడు దాశరథి

వెంపటాపు ప్రతిహింస తత్త్వాన్ని కాదని వెంగళరావు హింసా స్వామ్యాన్ని కొమ్ముకాస్తున్న 'అహింసావాది' దాశరథి - ఆయనకన్నా ఆస్థానకవి పదవికి అర్హులెవ్వరుండగలరా !

— సంపాదకుడు.

విప్లవ రచయితల సంఘం ప్రణాళిక

విప్లవాల యుగం మనది. దేశాలు స్వాతంత్ర్యంకోసం, జాతులు విమోచనకోసం, ప్రజలు విప్లవం కోసం పోరాడుతున్న ప్రస్తుత చారిత్రక దశలో రచయితలూ, మేధావులూ, తటస్థులుగా వుండలేరు సరికదా, తెలిసి తెలిసిగానీ, తెలియకగానీ, చారిత్రక శక్తులపట్ల పాక్షిక వైఖరిని తమ తమ రచనలలో కళా రూపాలలో ప్రదర్శిస్తారు.

నూతన ప్రజాతంత్ర విప్లవ లక్ష్యంగా, మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనా విధానం వెలుగులో, విప్లవ రచయితల సంఘం సాహిత్య, కళారంగాలను తన కార్యక్షేత్రంగా ఎంచుకుంటూంది. దేశదేశాంతర పీడిత ప్రజావిమోచనకు, స్వాతంత్ర్యానికి, సమానతకు పలుదశలుగా సాగే చారిత్రక పోరాటంలో తాను సాంస్కృతిక పాత్రనిర్వహిస్తుంది.

ఈ లక్ష్య సాధనకు నేటికీ అడ్డు నిలిచి వుంటూన్న భూస్వామ్య భావ జాలాన్ని నిర్మూలించేందుకు పూనుకొంటుంది. అంతేకాదు, అవసాన దశకు చేరు కుని ఉన్న సామ్రాజ్య వాద దేశాల తుచ్ఛ వ్యాపార సంస్కృతి ప్రభావాన్ని అరి కట్టేందుకు కృషి చేస్తుంది. బోల్షివిక్ విప్లవ విజయానికై సంస్కృతి సాహిత్యాల మహత్తర దోహదానికి, సోషలిస్టు-రియలిస్టు సంస్కృతి సంప్రదాయానికి రివిజనిం చేసిన అపచారాన్ని, సోషల్ - సామ్రాజ్యవాదంలో గర్భితమైవున్న ప్రపంచాధి పత్య కాంక్షను ప్రతిబింబించే జాతీయ దురహంకార వైఖరిని, వర్గ సంకరధోరణిని వ్యతిరేకిస్తుంది. మార్క్సిస్టు మహోపాధ్యాయులు ప్రజాపోరాటానుభవాలతో మేళవించి చేసిన సాహిత్య బోధలను, కళలగురించి సంస్కృతిగురించి లెనిన్ భావాలను, మావో ఏనాన్ ప్రసంగాల సారాన్ని, గోర్కీ, లూసన్‌ల ఉజ్వలసాహిత్యాన్ని కరదీపాలుగా చేసుకుంటుంది. పలసాధిపత్య కాలానికి సంబంధించిన ఉన్నత వర్గానుకూలమైన సంస్కృతికి మన విద్యా వైజ్ఞానిక, సాంస్కృతిక రంగాలనుండి ఉద్వాసన చెప్పేం దుకు సంకల్పించుకొంటూంది దేశ,దేశాంతర ప్రజాసంస్కృతిలోని పోరాటాంశనూ ధిక్కార ధోరణిని స్వీకరించి ప్రస్తుత యుగావసరాలకు అనుగుణమైన ప్రజా కళా రూపాలను పెంపొందింప జేసేందుకు పూనుకొంటుంది.

కళా, సాహిత్యం, విద్య, తత్వశాస్త్రం మొదలైన వాటితోగూడిన సమాజ జీవిత ఉపరితలంలో అభివృద్ధినిరోధక శక్తులకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తూంది. హేతువాద వైఖరి, శాస్త్రీయ దృక్పథం, గతితార్కిక చింతన - ఈ మూడింటినీ ఉద్యమ ప్రాయంగా పెంపొందింపజేస్తూ, నూతన ప్రజాస్వామికసమాజ అవతరణకు అనుకూలమైన భావ విప్లవాన్ని కలిగించేందుకు విరసం కృత నిశ్చయమైంది దేశ, దేశాంతరాలలో విప్లపిస్తూన్న ప్రజా - పోరాటాలనన్నిటినీ సాహిత్యపరంగా బలపరుస్తూంది.

తన ఏడేండ్ల జీవితంలోనే ఉన్నత సాంప్రదాయాలను నెలకొల్పి పోరాటాల పాఠశాలలో రాటుదేలిన ఈ చిన్న సంస్థ తన ఆశయ బలానికి తోడుగా సంఖ్యా బలాన్ని సమకూర్చుకుని మహా సంస్థగా పరిణమించేందుకై, పై లక్ష్యాలతో ఏకీభావం ప్రకటించే రచయితలకూ కళాకారులకు సభ్యత్వం యిస్తుంది. దీనితోపాటుగా పీడిత ప్రజాభిమానమూ, నిసలైన దేశాభిమానమూ గల రచయితలతోనూ, కళాకారుల తోనూ, నిత్య సంబంధాలు పెట్టుకుని, తన విశిష్టతను నిలుపుకుంటూనే, ప్రజా స్వామిక సాంస్కృతిక శక్తుల కన్నిటికీ అగ్రశ్రేణిగా రూపొందవలసివుంది. అప్పుడే తన లక్ష్యసాధన సులభతర మవుతుంది.

విప్లవ రచయితల సంఘం వర్ధిల్లాలి!

విప్లవం వర్ధిల్లాలి!

స్నేహ స్మృతులు :

మరో స్నేహలత

ఎవరు బాధపడుతున్నా చలించిపోయే దయార్ద్ర హృదయం, ఎవరికీ దేనికీ భయపడని ధైర్యం, కులమత భేదాలను పాటించని స్వభావం, స్పష్టమైన రాజకీయ చైతన్యం. చదువుల సరస్వతి (యం. ఏ. ఆంత్రోపాలజీ, బియస్సీ., బియిడీ.) మార్క్సిస్ట్, లెనినిస్ట్, కమ్యూనిస్ట్ సిద్ధాంతాలను మనస్ఫూర్తిగా నమ్మిన వ్యక్తి కుమారి బొమ్మారెడ్డి స్నేహలత. కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా తేలప్రోలులో తల్లి వైదేహి (43), తండ్రి లక్ష్మారెడ్డి (50) గార్ల ఏకైక పుత్రిక. జననం 1950 జనవరి 29. ఒకే ఒక తమ్ముడు రమేష్. చిన్నక్లాసునుంచి యూనివర్సిటీ చదువు పూర్తయేదాకా స్నేహలత అందరకూ స్నేహలతే. ఆస్తులున్నాయనీ, అందమైన వారమనీ విర్రవీగే వారిని మాత్రం గర్హించేది. తన భావాలను, అభిప్రాయాలనూ స్వేచ్ఛగా ప్రకటించేది కాని, అవి ఎవరిమీదా రుద్దేదికాదు. సహేతుకమైన ఆలోచనా సరళిని ఎప్పుడూ ఆహ్వానించేది. తేలప్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్లో యస్.యస్. ఎల్. సీ. అయాక, ఏలూరు సెయింట్ థెరిస్సాస్ కళాశాలలో పి. యు. సి. చేసి, డాక్టరు కోర్సు చదవాలని ఆశించి మెడికల్ ఎంట్రెన్స్‌లో కృతార్థురాలు కాలేక వైద్య వృత్తిద్వారానే కాదు; ఏ వృత్తిలోనైనా, ప్రజల సాన్నిహిత్యం సంపాదించు కొని వాళ్ళని రాజకీయాలకు పరిచయం చేసి, ప్రజలు తమ స్థానం కొరకై వ్యవస్థలో మార్పును సాధించడానికై పోరాటాలకు పుత్తేజపరచ వచ్చుననే నిజాన్ని తెలుసుకుని, మార్క్సిజం గురించి పార్టీ కార్యక్రమాల గురించి అధ్యయనంచేస్తూ, లోతైన అవగాహనను, కార్యశీలతను పెంపొందించుకుంది. యూనివర్శిటీలో చేరాక వేషంలో తప్ప ప్రవర్తనలో నిజాయితీ, నూతనత్వ కాంక్ష లేని యువతరాన్ని చూసి చాలా బాధపడింది. తనకు పెళ్ళి సంబంధాలు వస్తూంటే, సంఘంలో పెళ్ళి అనేది వ్యాపారం కింద తయారవడాన్ని చూసి పెళ్ళంటే విరక్తిని పెంచుకుంది. "పెళ్ళి కోసం నా ఆశయాల్ని అమ్ముకోను" అని నిశ్చయంగా చెప్పింది ఇంట్లోవారితో.

స్నేహలత తన అభిప్రాయాలను సూటిగా చెప్పడానికి అప్పుడప్పుడు యూనివర్శిటీ మేగజైన్స్‌లో కథలూ, గేయాలూ వ్రాసింది. విశాఖలో జరిగిన 'విరసం' సభలకూ, సమావేశాలకూ హాజరయేది.

ఈ సంఘం బురద గుంటలో సుఖపడలేనని, సంఘంలో వున్న కుళ్లనీ, దేశంలో జరుగుతున్న అన్యాయాలనీ, అక్రమాలనీ చూస్తూ సుఖపడలేనని- స్వసుఖాన్ని త్యజించి ఇల్లు వదలి విప్లవమార్గాన్ని ఎంచుకుని వర్గశత్రువుల చేతుల్లో తన ప్రాణాలను కోల్పోయింది.

"స్నేహలత" యువతరానికి "లైట్ హవుస్"!

—పి. యస్.

('ఆంధ్రజ్యోతి' వార పత్రిక సౌజన్యంతో)

స్నేహలత ఒక ప్రవాహం

'ఎదురుదాడి' జరిపిన విప్లవదళాన్ని పోలీసులు కాల్చివేశారని, వెంగళరావు ప్రభుత్వం 1975 జనవరి రెండవవారంలో ప్రకటించింది. ఆ దళంలో ముగ్గురు సభ్యులున్నారని వారిలో ఒకరు యువతి అని కూడ ప్రకటించింది. శవాలను మాత్రం బంధువులకు అప్పగించలేదు. ప్రభుత్వమే దహనసంస్కారాలు చేసినట్టు ప్రకటించుకొంది. ఎదురుదాడులని పేరుపెట్టిన అన్ని సంఘటనల్లాగే, ఈ సందర్భంలోకూడ, ప్రభుత్వం ఆ ముగ్గురు వీరులను క్రూరంగా నిస్సహాయులుగా ఉన్నప్పుడు హత్యచేసి ఉంటుందనేది తేలికగా ఊహించుకోవచ్చు. అమరజీవులు జగన్‌మోహనరెడ్డి (పెనుమాక టీచర్) సూరయ్య (మేతరాజపల్లి 20 సం॥లు) ఆమెతో పాటువున్నారు.

ప్రభుత్వం హత్యచేసిన ముగ్గురిలో స్నేహలత ఒకరు. తీగలాంటి సున్నితమైన శరీరం, మల్లెపూవుకన్న తెల్లనైన మనస్సు, సముద్రమంత విజ్ఞానం. ఇన్నీ కలిపితే స్నేహలత అవుతుంది. హత్యజరిగిన నాటికి ఆమె వయస్సు 25 మాత్రమే. ఈ వ్యవస్థ చెప్పేప్రమాణాలతో గణించినా ఆమె విద్యాధికురాలే. ఎం. ఎ. (మానుషశాస్త్రం); బి. యస్ సి; బి. యిడి; ఆమె డిగ్రీలు. ఆమె చదువు ఇంతకన్న కొన్ని వేలరెట్లు ఎక్కువ. జీవితాన్ని ఆమె ఏదోగడపలేదు చదువుకుంది. మననం చేసుకుంది పుట్టింది, పెరిగింది కలిగిన వారియింటనైనా ఆమె హృదయం లేనివారితోనే పోరాటం లేమితోనే. గౌరవనీయమైన కుటుంబములో పుట్టింది, పుట్టిన తేల్రప్రోలులో హైస్కూల్ వరకు చదువుకుంది. ఏలూరు, గుంటూరు, విశాఖలలో పైచదువులు చదువుకుంది. చిన్నతనంనుండి జీవితాలను, పరిస్థితులను పరిశీలించటం ఆమెప్రవృత్తి. అందుకే కాలేజీలలోను, స్కూళ్ళలోనూ చదువుకున్న చదువుకంటే ఉన్నతమైనవిద్య, విజ్ఞానం జీవితంలోనే ఎక్కువ సంపాదించుకుంది. నైటుక్లబ్బులు, వేశ్యా వాటికలులాంటి ప్రదేశాలకు కూడ, అధ్యయన ప్రవృత్తిలోవెళ్ళింది. ఆ దీనావస్థలోని వాళ్ళుఅందరూ తన వాళ్ళుగా భావించింది. వారిసమస్యల గురించి ఎంతగానో తెలుసుకుంది. మన

జీవితాలలో వున్న నికృష్టం, దౌర్భాగ్యం..........అన్నీ కళ్ళారా చూసింది. మనసారా వ్యధచెందింది. తనఆలోచనలకు, ఆవేదనలకు- కవితలుగా, కథలుగా అక్షరరూపం ఇవ్వడానికి ప్రయత్నించింది. ఇచ్చింది. కాని అక్షరాలు, పదాలు స్నేహలతకు సంతృప్తి నివ్వలేదు. ఆమె ఆవేదన ఆరిపోలేదు. ఈ వ్యవస్థను అర్థం చేసుకొంటే సరిపోదు. దాన్నిమార్చాలి. పరిమార్చాలి. ఇదీ స్నేహలత తీసుకొన్న నిర్ణయం. తనకు తానుచేసుకొన్న ప్రతిజ్ఞ.

మానవజాతిమీద, మానవత్వం మీద మహోన్నతమైన ప్రేమవున్నప్పుడే ఈ వ్యవస్థ మీద జుగుప్సా, అసహ్యం, ద్వేషం కలుగుతాయి. స్నేహలత నిజంగా స్నేహలత. ఆమెకు మానవజాతితోస్నేహం. మానవత్వంతో స్నేహం. మంచితనంతో స్నేహం. అందుకే దుర్మార్గులకు విరోధం. మానవత్వానికి వ్యతిరేకమైన ప్రతిదానితో విరోధం. ఈ ద్వంద్వయుద్ధంలో రాక్షసత్వం ఆమెను కబళించింది. కాని స్నేహలతకు ఈ వ్యవస్థ తెలుసు దాని దుర్మార్గం తెలుసు. తెలిసి, తెలిసి పాశవిక దుర్మార్గానికి ఎదురునిల్చింది. తనకుతాను విధించుకొన్న కర్తవ్యానికి మరో ప్రపంచాన్ని సాధించాలనే కర్తవ్యనిర్వహణకు — అంకితమైపోయింది.

స్నేహలతలాంటి వారు కేవలం వ్యక్తులుకారు. ఒక ప్రవాహం. ప్రవాహం వేగం తగ్గవచ్చును. ప్రశాంతంగా వున్నట్టు అనిపించవచ్చును. కానీ ప్రవాహం ఆగదు.

— రహి

నూతన సృష్టికోసం

"మార్క్సిజం సృజన ప్రజ్ఞను నిర్మూలించదా ? నిర్మూలిస్తుంది. ఫ్యూడల్, బూర్జువా పెటీబూర్జువా, మితవాద, వ్యక్తివాద, శూన్యవాద, శుద్ధకళావాద, అభిజాత్య, క్షీణ, నిరాశావాద సృజన ప్రజ్ఞను అది తప్పక నిర్మూలిస్తుంది – అలాంటి సృజన ప్రజ్ఞలు ప్రజాబాహుళ్యానికీ, శ్రామికులకూ విరుద్ధమైనవి శ్రామికవర్గ రచయితలకు, కళాకారులకూ సంబంధించినంతవరకు ఇలాంటి సృజన ప్రజ్ఞలు నిర్మూలం కావద్దా ? కావాలనుకుంటాను; వాటిని పూర్తిగా నాశనం చెయ్యాలి. అవి నాశనం అవుతుండగా నూతన సృష్టికి అవకాశం వుంటుంది —"

స్నేహలత కవితలు :

ఏమని వ్రాయను?

నాకూ వ్రాయాలని ఉంది
ఏమని వ్రాయను ఎవరని వ్రాయను ?
ధన మదాంధంతో కళ్ళు గానక
చేసే అధికారుల దురంతాలా ?

పేదల బాధలు చూసి చేసే వికటాట్ట హాసాలా ?
దేవుని పేరిట చేసే మోసాలా ?

ధన వ్యామోహంలో బిడ్డల గొంతు కోసే
ధన ప్రియాంధ తండ్రుల చేతలా ?

వరకట్నానికి ఆహుతి అయే
బాలికల విషాద గాథలా ?

లంచగొండులకు అవినీతి పరులకు
రక్షణనిచ్చే అధికారుల పాట్లా ?

ప్రజాప్రభుత్వం పేరిట చేసే
నియంతృత్వ పాలనా ?

ఏమని వ్రాయను ఈ విషాద విధి వైపరీత్యం ?

ఎటుచూచినా విషాదం !
ఏది విన్నా భయంకరం !

ఏది దారి ?

ఆదర్శ వివాహం

ఆదర్శ వివాహం
అంటే ఏమిటి ?
దండలు మార్చుకొనుటా ?
మంగళసూత్రం లేకపోవుటా ?

హోటల్ మహిర్ లో
పలుకుబడి వ్యక్తులకు పార్టీలు
అదే సింప్లిసిటీ అట
నేటి ఆదర్శ వివాహమట

పగడాల నెక్లెసులట ! పట్టు పీతాంబరాలట !
మంగళసూత్రం లేదట ! ఇది ఆదర్శ వివాహమట !

అట్టహాసాలు అసలే లేవట ! భూతద్దంలో వెదికినా కానరావట
ఆడంబరాలు ! ఈ వార్తా పత్రికలకు.

అన్నీ ఉన్న ఆకు అణిగివుండునట్లే
ఆచరించేవారు ; వీపునకట్టుకు తిరుగరు.

వేదిక మీద వివాహం ! సింపుల్ అనటం
నేడొక ఫాషన్ అదే ! ఆచరణలో సున్నా

ఇదేనా ఆదర్శ వివాహం ?
ఏదీ ఆదర్శ వివాహం.

(బి. ఎస్సి మూడో సంవత్సరంలో రాసిన కవితలు)

"బూర్జువా సమాజంలో ఎందరో శ్రామికుల స్వేచ్ఛా సమాధిపై కొందరి స్వేచ్ఛ జీవిస్తుంది."

— కాడ్వెల్

విద్యార్థి దశలో స్నేహలత భావాలు

"కన్నతల్లి తన బిడ్డను చెడుగా మారటానికి దోహదపరచిన రీతిగా, విద్యార్థుల పతనానికి కారణమవుతున్న ఈ విద్యాలయాల తీరు ఏ జాతికి మార్గదర్శం ?"

(స్నేహలత కథ 'విక్టిమ్స్ ఆఫ్ క్రైమ్' లో వినీత)

"స్త్రీకి వెలకట్టి వెలయాలుగా మార్చిన ఈ సమాజం, తనకుతాను వెల కట్టుకొని అమ్ముడుపోతున్న ఈ మగవాడిని ఏమనాలో తెలియక మూగపోయిందా? లేక దానికి మతిపోయిందా ? స్త్రీకి పెళ్ళి అవసరమని, అది ప్రకృతి సిద్ధమని వంకర మాటలు చెప్పటం మగవాడు తాను అధికుడిగా ఉండడానికి అర్హత సంపాదించుకోవటానికేకదా !"

(స్నేహలత కథ 'విక్టిమ్స్ ఆఫ్ క్రైమ్'లో జ్వాల)

న్యాయస్థానాలు, చట్టాలు నీ కొరకుకాదు నీలాంటి అసహాయులు, అభాగ్యులు తిండిలేక స్వార్థపరుల చేతుల్లో నశించక ఎదురు తిరుగుతుంటే ఈ చట్టం నిన్ను శిక్షించటానికి బయలుదేరుతుంది, అధికారుల తొత్తు ఈ న్యాయస్థానం."

(స్నేహలత కథ 'విక్టిమ్స్ ఆఫ్ క్రైమ్'లో వినీత)

"పాతివ్రత్య మహిమ మత్తెక్కించి ఆడదాన్ని అడ్డగాడిదకింద మార్చిన ఈ పురాణాలు ఆదర్శాలా లేక అవకాశవాదుల చేతిలో ఆయుధాలా ?

(స్నేహలతకథ 'విక్టిమ్స్ ఆఫ్ క్రైమ్'లో వినీత)

"పూర్వం దేవదాసీలను బహిష్కరించిన ఈ మనిషి ఈనాడు నాగరికత అనే బురఖా తగిలించుకొని ఈ కేబెరా డాన్సులను ప్రోత్సహిస్తున్నాడు. తాగి తందనాలాడుతూ ఒక స్త్రీ అర్ధనగ్న నృత్యాలను చూస్తూ వేటకుక్కలు తరిమినప్పుడు చిందులుత్రొక్కే పందుల్లాగా గెంతుతున్న ఈ నాగరికులు నాగరికులా లేక ఆటవికులా ? తిండి లేక, ఈ నవ నాగరిక సమాజంలో బ్రతుకుతెరువులేక, ఆ కేబరా డాన్సరు కార్చేది కన్నీరు కాదని, రక్తబిందువులేనని, ఆవిడ బ్రతికేది ఈ సమాజంపై పగతోనని వీరిలో ఏ ఒక్కడైనా గ్రహిస్తున్నాడా? ఇలాంటి జీవితాలకు ముగింపు ఏమిటి ? ... ఏమిటి ?? ......"

(స్నేహలత కథ 'విక్టిమ్స్ ఆఫ్ క్రైమ్'లో ముగింపు మాటలు)

★★

స్కెచ్ :

రాముని దరఖాస్తు

- బియస్సెన్నార్.

రాముడు కలెక్టరాఫీసులో ప్యూన్ పనికి దరఖాస్తు పంపేడు

పేరు : రాముడు
వూరు : గుంతలపల్లి
తండ్రి : పెదరాముడు
వూరు : గుంతలపల్లి
తాత్కాలిక చిరునామా : గుంతలపల్లి (పోష్టు), ఆం. ప్ర.
శాశ్వత చిరునామా : గుంతలపల్లి (పోష్టు), ఆం. ప్ర.
ప్రస్తుత వుద్యోగం : పెద్దరై టింట్లో కూలిపని
తండ్రి వుద్యోగం : తండ్రి, తాత, అంతకు ముందువారుకూడ అదే యింట్లో అదేపని.
వయసు : పందొమ్మిది
చదువు : సెకండ్‌ఫారం ఫెయిల్
స్కూల్ పేరు : గుం. ప. అ. ప్రై. స్కూల్.
ఆటలలో ప్రావీణ్యత : మెడపట్లు పట్టుట; గడార్లెత్తుట; చెడుగుడు.
మాతృభాష : తెలుగు
మతము : } అవన్నీ ఎందుకుసార్ !
దేశము : }
యింతకు ముందు చేసిన నేరములు : ఏమీ లేవు.
జైలుకు పోయిన సమాచారము : ఒకసారి పోలీసిన్స్పెక్టర్ మా వూరికి వచ్చినపుడు బూటుకాలికున్న కల్లు మరకలని (కల్లంగడిలో లంచమీనందుకు కుండలు బగలగొట్టొచ్చేడు) తుడవమన్నప్పుడు నే నెదురుతిరిగితే జీపులో వేసుకుపోయి జైల్లో వేసేడు.

ఆ వూరి మున్సబయిన పెద్దరైతు సర్టిఫికెట్ యిలా యిచ్చేడు :

రాముడు బలవంతుడు. రాముడు ఎట్టిపనినయినను సునాయాసముగ చేయగలడు. రామునికి పెండ్లి అయినది. భార్య అందమైనది. మంచి పనికత్తె. రామునికి ఆస్తిలేదు కాని కష్టపడి బతకడానికి దేవుడు దయతో కండబలము మెండుగ ఇచ్చినాడు.

మున్సబుగారి సర్టిఫికెట్ చూసి కలెక్టర్‌గారు చాల సంతోషించేరు. కాని అంతలోనె కనుబొమ్మలు ముడివేసేరు. బీదవాడు ఎదురుతిరగడమన్న అడవిలో అగ్గిపుట్టినట్లు. ఈ ప్రపంచంలో అంతకన్న అపాయమైంది మరేదీలేదు.

...అలాంటి అపాయాన్నుంచి 'ప్రపంచాన్ని' రక్షించడానికేగద పోలీసులు, పార్లమెంటులు, ఎన్నికలు, కలెక్టర్లు, జైళ్ళు, వకీళ్ళు, సైన్యాలు, కోర్టులు, రాజ్యాంగాలు, వురికంబాలు, సెక్స్ సినిమాలు, సెంటిమెంట్ల పుస్తకాలు, వార పత్రికలు, వార్తాపత్రికలు, అటంబాంబులు, అహింసా సిద్ధాంతాలు (గాంధీ టోపీలు), మతాలు, తుపాకులు...యిన్ని వుండీకూడ ! యిన్ స్పయిట్ ఆఫ్ ఆల్ దీస్...! ప్రజలనబడే యీ రాస్కెల్స్ ఎంత తెగించిపోయేరు ! పైగా జైలుకు పోయేనంటున్నాడు గాని నేరం చేయలేదంటున్నాడు. జైలుకి వెళ్ళడమే నేరం. అంతే. యింకా పద్మ్మాడు పద్మాల్గు అయిటమ్‌ల దగ్గర దరఖాస్తు అసంపూర్తిగ వుంది. దేశభక్తి లేదు. ద్రోహి.. ....

కలెక్టరింక ఆలోచించలేదు. రామునికి వుద్యోగం రాలేదు.

ఆ తరవాత రాముడొకసారి ఒకానొక విషయమై మున్సబును చితకదన్నినందుకు మళ్ళీ జైలుకు పోయేడు. రాముడు దాన్ని జైత్రయాత్ర అంటాడు.

....

పాఠకులు దీన్ని యిదేమి కథ అని అనుకుంటారేమొ నాకు తెలీదుగాని ఆ నడుమ నేను రామునికి చూపించినప్పుడు అతను సంతృప్తిగ నవ్వేడు. ఆ దరఖాస్తు ఫారాన్ని రాముని సూచనలమేరకు పూర్తిచేసింది నేనే.

గత సంచికలో కాళోజీ కవిత 'తిరుగుబాటు గెలుస్తుంది' 3-12-75 న ఆయన డైరీలో వ్రాసుకున్నది. భూమయ్య, కిష్టాగౌడ్‌లు ఉరితీయబడిన తేది 1-12-75.

[సెప్టెంబర్ 11 మావో - సె - టుంగ్ ప్రథమ వర్ధంతి. అక్టోబర్ 1 జనచైనా అవతరణ సందర్భంగా జనచైనా విప్లవ పోరాటంలో సాంస్కృతిక సైన్యం పాత్ర గురించి మావో రచన వుంటుంది.]

సాహిత్యంలో వస్తు శిల్పాలు

- త్రిపురనేని మధుసూదనరావు

ఏ విషయంలో అయినా నిర్వచనాలు చేయటం సరియైంది కాదు. అది శాస్త్రీయ వివరణకు దోహదం చేయదు. అందునా సాహిత్యం అనేటప్పటికి తప్పుడు సిద్ధాంతాలు చేసే అవకాశం చాల ఎక్కువ. కళలకు సంబంధించిన అంశంలోనూ ఇంతవరకు ఏకాభిప్రాయం వున్నట్లు కనబడదు. అధ్యయనం చేసే శాస్త్రీయ పద్ధతి అలవాటులో లేకపోవడమే బహుశా ఈ గందరగోళానికి కారణం.

సాహిత్యాన్ని సృష్టించటం సాహిత్యాన్ని వివరించడం కంటే సులభంగా కనిపిస్తోంది. సమాజానికి చరిత్ర ఆరంభమయినప్పటినుంచి, ఆ చరిత్రలోభాగంగా సాహిత్యం వుండనే వుంది. వాస్తవానికి సాహిత్యానికి ప్రత్యేకమైన స్వతంత్ర ప్రతిపత్తిగల చరిత్ర వుండదు- ప్రజల చరిత్రలో అది ఒక చైతన్య కార్యకలాపం. అందుకనే సాహిత్య స్వరూప, స్వభావాలను సమాజ పరిణామం వెలుగులోనే పరిశీలించ వలసి వుంది. చారిత్రకత ఆధారంగానే పరిశోధించ వలసివుంది.

వస్తువు-శిల్పం

సాహిత్యంలో మౌలిక సమస్య వస్తు-శిల్పాలకున్న సంబంధం. ప్రాచీన యుగాలనుంచీ ఆ యుగాల పరిధిలో అనేకమంది ఈ విషయాన్ని గూర్చి అభిప్రాయాలను ప్రకటించారు అన్నింటిలోవలెనే ఈ విషయంలోనూ వర్గ స్వభావమే పునాదిగా వుంది. ప్రపంచంలో ప్రతిదానికీ ఏదో ఒక రూపం వుంది. పదార్థాల్లో సారాంశం వస్తువే అయినా అది రూపంతోనే అస్తిత్వంలో వుంటుంది. రూపాన్ని ఆశ్రయించుకనే వస్తువు వ్యక్తం అవుతుంది. సమాజ జీవితంలో వచ్చే ప్రతి చిన్న మార్పూ వస్తువులో మార్పును తెస్తుంది కాని రూపంలో కొన్ని అతి ముఖ్యమైన చారిత్రక సందర్భాల్లోనే మార్పు కనిపిస్తుంది. జీవితానుభవంలో కొత్తశక్తులు కొత్త రూపాలను అభివృద్ధి చేస్తాయి. సాధారణంగా అభివృద్ధి క్రమంలో వస్తువే రూపాన్ని నిర్ణయిస్తుంది. రూపం వస్తువును నిబద్ధించే సందర్భాలు కూడా వుంటాయి.

సాహిత్యంలో వస్తు, శిల్పాలు అంటే అర్థం ఏమిటి? వాటి పరస్పర సంబంధం ఏమిటి? సాహిత్యంలో వ్యక్తమయ్యే ప్రధాన భావాన్ని వస్తువన వచ్చును. రచయిత సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని వస్తువుగా చెప్పవచ్చును. ఆ వస్తువు ఏ రూపంలో అభివ్యక్తం అవుతుందో, ఆ రూపాన్ని శిల్పం అంటారు. ప్రక్రియ (Form), భావ ప్రతిమలు, భాష శిల్పంలో ముఖ్యమైన అంగాలు. భాష భావప్రతిమలుగా రూపొంది మొత్తం అనుభూతికి, అనుశీలనకు అందే స్వయం సమగ్రమైన రూపంగా వ్యక్తంకావటం ప్రక్రియ. పురాణం, నాటకం, ప్రబంధం, నవల, కథ, గేయం మొదలైనవి ప్రక్రియలు. జీవితంలో అనుభవానికి దృశ్యనిర్మాణం చేయటం భావప్రతిమ. అసలుసాహిత్యం అంటే 'భావప్రతిమల్లో ఆలోచించటం'గా నిర్వచించినవాళ్లున్నారు. భాష సాహిత్యానికి జాతీయరూపాన్ని ఇస్తుంది. ప్రధానంగా ఈ మూడుఅంశాలు కలిసే శిల్పం అంటాం. ఈ వస్తు, శిల్పాల్లో ఏదిముఖ్యం? ఇందులో వస్తువు నిర్ణయాత్మకమైన పాత్రనిర్వహిస్తుంది. కాబట్టి వస్తువే ప్రధానమైన అంశం.

కళారంగంలో శిల్పవాదులూ వస్తువాదులూ ఆదిమ కాలంనుంచీ వున్నారు. అంటే, సాహిత్యంలో శిల్పమే ప్రధానమని వాదించేవాళ్ళూ, సాహిత్యంలో వస్తువే ప్రధానమని వాదించేవాళ్ళూ వున్నారని అర్థం. ఫ్యూడల్ సాహితీపరులు, కళానిపుణులు శిల్పవాదులుగా ప్రసిద్ధిపొందారు. ఆ యుగాల్లో వివిధదేశాల్లో పండితుల అభిప్రాయాలను పరిశీలిస్తే వాటిలో వర్గస్వభావాన్ని సులభంగానే విశ్లేషించవచ్చును. ప్రక్రియకు భాషకు ఎంత ప్రాధాన్యం ఇచ్చినట్టు పైకి కనిపించినా, ఫ్యూడల్ కళానిపుణుల వాదాల్లోకూడా వస్తుప్రాధాన్యాన్ని మనం గమనించవచ్చును.

శ్రమ—కళ

ఇతర విషయాల్లో సాహిత్యంకూడ సామాజిక అవసరాలనుంచే పుట్టింది. భాషవలె భాషకు ఉన్నతరూపమైన సాహిత్యంకూడ శ్రమనుంచీ శ్రమలోనే, శ్రమతోపాటే పుట్టిపెరిగింది. ప్రకృతితో, సమాజంతో ఆవేశంతోకూడిన సంబంధాల ఫలితమే సాహిత్యం. అంటే, సాహిత్యం మానవీయమైన ఒక చైతన్య రూపం. ఉత్పత్తి సాధనాలమీద, పనిముట్లమీద వాటిని వుపయోగించేసే సామూహిక శ్రమమీదా మనిషి అనుభూతితో కూడిన సంబంధం పెట్టుకున్నప్పుడు, సాహిత్యరూపాలు ఏర్పడ్డాయి. ఆత్మరక్షణ, ఆహారసంపాదనలనుంచీ ఆరంభమైన సాంఘిక జీవనక్రమం సాహిత్యంలో వస్తువైంది. శ్రమకు పూర్వంమనిషి

వూహల్లోని శ్రమఫలితం, సాహిత్య వస్తువును వూహించటానికి పునాదిఅయింది. మనిషిలో ఎప్పుడైతే ఇతర మనుషులతో కలిసి నిర్మాణ కౌశలం ఆరంభం అయిందో అప్పుడే, సాహిత్యంలోవస్తు, శిల్పాలు ఏర్పడ్డాయి. శిల్పంలో ముఖ్యాంశమైన భాష శ్రమనుంచేపుట్టి మానవసంపర్కాన్ని క్రమబద్ధంచేసింది. ఆదిమ మానవుల్లో చేపలుపట్టటం, వేటాడటం, పశువులపెంపకం మొదలైన శ్రమ క్రమాల్లోనేవస్తు, రూపాల అంతర్గత గాఢసంబంధాన్ని మనం గ్రహించవచ్చును. శ్రమకంటెముందే ఆ శ్రమ మూలంగా తాము సాధించదలచిన ఫలితాన్నిగురించి మనిషికిఊహలు, అభిప్రాయాలు వున్నాయి. కాబట్టి వస్తువు మౌలికాంశం వస్తువు తనకు అనుగుణ్యమైన రూపాన్ని పొందుతుంది.

ఆదిమ సమాజం

ఆదిమ యుగాల్లో సాహిత్యం మనకు అందుబాటులోలేదు. చారిత్రిక పరిణామాన్ని శాస్త్రీయంగా పరిశీలించటంద్వారా ఆదిమ సమాజ కళారూపాలను గూర్చి కొంత వూహించటం సాధ్యం కావచ్చును. స్పష్టంగా రూపొందిన పనిముట్లు, సాధనాలు లేవు కాబట్టి ఆదిమ మానవుల శ్రమ సామూహిక మానవశ్రమే. జట్లుగా గుంపులుగా ఆహార సంపాదనంచేసి అందరూ అనుభవించే యుగం కాబట్టి ఆనాటి సాహిత్యం అనబడే మాజిక్ (మాయ) లాంటి బృంద నృత్యాల్లో, వాళ్ళు వుచ్చరించే ధ్వనుల్లో, ఒక సామూహికత ఉండేది. వస్తువులో, శిల్పంలోకూడ సామూహికత్వం అప్పుడు ఒక ప్రధాన లక్షణంగా వుండేది. వాళ్ళ భౌతిక జీవితం చాలా పరిమితం కాబట్టి భావరంగం పరిమితమే శబ్దకోశం పరిమితమే. అయితే వస్తు శిల్పాల మధ్య ఐక్యత పటిష్టంగా వుండే అవకాశం చాల ఎక్కువ.

వర్గ సమాజం

ఇప్పుడు మనకు అందుబాటులోవున్న సాహిత్యం అంతా దాదాపు వర్గ సాహిత్యమే. అంటే వర్గాలుగా విభజింపబడిన సమాజ జీవితంనుంచి పుట్టిన సాహిత్యమే. కాబట్టే సాహిత్యాన్ని వర్గదృష్టితో పరిశీలించ వలసిన ఆవశ్యకత వుంది. వస్తు విశ్లేషణచేస్తే నిర్దిష్ట రచన ఏ వర్గ జీవితాన్ని ప్రతిబింబిస్తోంది అనేది తేల్చుకోవచ్చును. సాధారణంగా ఏ యుగంలో అయినా భౌతిక విషయాలమీద,

అంటే, స్థూలంగా వుత్పత్తి సాధనాలమీద, ఏ వర్గానికి అధికారం వుంటుందో బౌద్ధిక విషయాలమీదకూడ ఆ వర్గానికే అధికారం వుంటుంది. అధికారవర్గం భావాలే యుగ విశిష్ట భావాలుగా గణించబడతాయి. శిల్పం వస్తువును అనుసరించేదే కాబట్టి ప్రక్రియ, భావప్రతిమలు చాలవరకు అధికారవర్గ బాహ్య స్వరూపాన్ని ఆశ్రయించే వుంటాయి. భాషవరకు పదబంధాల్లోనూ, యాసలోనూ అధికారవర్గానికి సంబంధించి వుంటుంది. సాహిత్యం సామాజిక జీవితానికిగల వుపరితలంలో ఒకానొక అంశం కాబట్టి స్పష్టమైన వర్గ విశ్లేషణ అన్ని సందర్భాల్లోనూ సాధ్యం గాకపోవచ్చును. రచయిత మొత్తం జీవితాన్ని, అంటే, సమకాలిక జీవితాన్ని చిత్రణ చేసినట్లు కనిపించినా, ప్రధానంగా రచయిత ఏదో ఒక వర్గానికి అనేక సందర్భాల్లో పాలకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తాడు. వర్గాతీతమైన కళ అంటూ వుండదు. సమాజంలో ఒక చారిత్రక దశ మారినప్పుడు, తక్షణం వుపరితలంలో వున్న సాహిత్యం మారిపోదు. వుత్పత్తిశక్తుల్లో మార్పు వచ్చిన వుత్పత్తి సంబంధాలు మారతాయి. ఆ తర్వాత క్రమంగా సాహిత్యాది వుపరితలంలో మార్పు వస్తుంది. అలాగే రచనలో ప్రధాన భావం చారిత్రక దశకు పరిమితంగా, అధికార వర్గ ప్రతిబింబంగావున్నా, అంతకు పూర్వ సమాజంలోని అనేక విషయాలు తిరోగామి, పురోగామి భావాలు రచనల్లో చోటు చేసుకుంటాయి. రాబోయే చారిత్రక దశను కాల్పనిక ఆవేశంతో చిత్రించటంకూడ జరుగుతుంది. ఏ యుగంలో నయినా, మౌలికమైన మార్పును కోరే భావాలు ప్రమాదకరమైన భావాలుగా అధికారవర్గాలచేత పరిగణించబడతాయి. రచనలో వస్తువును పరిశీలించేటప్పుడు ఈ విషయాలన్నిటిని దృష్టిలో వుంచుకోవాలి.

ప్రతి యుగం, మానవ విజ్ఞానం అభివృద్ధితోబాటు, అవాస్తవమైన భ్రమ జనితమైన మూఢ భావాలనుకూడ అభివృద్ధి చేస్తుంది. వర్గసమాజ ఆరంభదశల్లో పనిముట్లు, వుత్పత్తి సాధనాలు అభివృద్ధికావటంతో పురాణంవంటి ప్రక్రియలు పుట్టాయి. బానిస, అర్ధబానిస సమాజ జీవితంలో రుణ, ధనాంశాలు ఈ ప్రక్రియల్లో చాలా వున్నతంగా చిత్రించబడ్డాయి. జీవితాన్నిగూర్చి, ప్రకృతినిగూర్చి సరియైన అంటే, శాస్త్రీయమైన భావాలతోబాటు, జీవితాన్నిగూర్చి, ప్రకృతినిగూర్చి, అహేతుకమైన అద్భుతాలనుకూడా బహుళంగా చిత్రించటం జరిగింది. విశాలమైన భూమి సాగులోకిరావటం, బానిస యజమానులు, అర్ధ బానిసల యజమానులు నియత బృందంగా స్థిరంకావటంతో, సమాజ ఆరంభదశల వాస్తవికత అద్భుతాలతో పురాణం వంటి ప్రక్రియలో వివరించటం జరిగింది. దేవుళ్ళు, దేవతలు, రాజులు,

పురోహితులు, చిల్లర దేవుళ్ళు, పరలోకాలు, జన్మలు, కర్మలు, ఆత్మలు మొదలైన 'భ్రమ'లన్నీ బానిస, అర్ధబానిస, చారిత్రకదశల జీవిత వివరణలే. సమాజ ఆరంభాల్లోని మానవ విజయాలు పురాణాల్లో వస్తువుకాగా, మానవ భ్రమలు పురాణ ప్రక్రియ.

భూస్వామ్యయుగం

సాహిత్యం ప్రధానంగా అర్ధ బానిసయుగం అనబడే ఫ్యూడల్ యుగాల్లో బాగా అభివృద్ధి పొందింది. పాలక వర్గాల జీవిత విధానం, వాళ్ళ జీవిత వైరుధ్యాలు ప్రధాన వస్తువుగా రూపొందింది. పాలకవర్గాన్ని సర్వగుణ సంపన్నమైన నాయకత్వంగా సాహిత్యం కీర్తించింది. దీర్ఘకావ్యాలు, నాటకాలు ఈ యుగాల్లో ప్రధాన ప్రక్రియలుగా వున్నాయి. శిల్పవాదంకూడా ఫ్యూడల్ కళానిపుణులే విపులంగా ప్రచారం చేసారు. రాజులు, భూస్వాములు, పురోహితుల వైభోగ జీవితం, ఈ పాలక వర్గాలమధ్య వైరుధ్యాలు, ఫ్యూడల్‌యుగ సాహిత్యవస్తువైంది. రైతాంగం, చేతిపనివాళ్ళు ఎక్కడో కొన్ని సందర్భాల్లో పూర్తిగా అధీనులుగా వర్ణించబడ్డారు. పాలకవర్గ విధేయులుగా ప్రభుభక్తిపరాయణులుగా చిత్రింపబడినారు. రాజుల అధికార దర్పాన్ని, దర్జా జీవితాన్ని, రాజవీధుల సౌందర్యాన్ని, కోటల్ని అంతఃపురాన్ని విశాల పృథ్వీ అధికారాన్ని స్ఫురింపచేసే శిల్పంలోనే, ఆనాటి సాహిత్య రూపాలు మలిచారు. నాటకాల్లోకూడ ఆ స్థానాల్లో ప్రదర్శించటానికి అనువైనట్లుగానే వస్తు చిత్రణ జరిగింది. పాలకవర్గాల మధ్య వైరుధ్యాన్ని విషాదాంత నాటకాల్లో మంచి మంచికీ చిన్న బలహీనతలకీ మధ్య ఘర్షణగానే చిత్రించారు. కులీనులే, సంప్రదాయ వ్యక్తులే ప్రధాన పాత్రలుగా, అంటే, ప్రధాన జీవిత భాగాలుగా నిర్మించబడినారు వినేది, చూసేది సంతోషించేది, కులీనులే. రాజబంధువులే .కాబట్టి పరమ విశ్రాంతి వాళ్ళకే సాధ్యం కాబట్టి సుదీర్ఘ కావ్యాలు, విపుల నాటకాలు వచ్చాయి. రసానుభూతి అన్నా చిత్త ప్రక్షాళనం అన్నా వర్గవిధేయతా వాదమే.

పెట్టుబడి దారీయుగం

ఫ్యూడల్ విధానం స్థానంలో పెట్టుబడిదారీ విధానం వచ్చేప్పటికి ప్రపంచం అంతటా ఆధునిక సాహిత్యంఅనేది ఆరంభమయింది. అర్ధబానిస వర్గాలకు వ్యతిరేకంగా బూర్జువాలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వంలాంటి ప్రజాస్వామ్య నినాదాలు యిచ్చారు. మతానికి వ్యతిరేకంగా శాస్త్రవిజ్ఞానాన్ని అభివృద్ధిచేసారు. పారిశ్రామిక విప్లవం జీవితానుభవాన్ని మార్చివేసింది. వస్తు, శిల్పాల్లోకూడా గుణాత్మకమైన మార్పువచ్చింది మానవతావాదం, వ్యక్తి

స్వేచ్ఛ మొదలైన ఆదర్శాలు ప్రధానవస్తువులైనాయి. శాస్త్రప్రభావంతో ప్రతీకవాదం (సింబాలిజం) లాటి నూతన వుద్యమాలు వచ్చాయి. ఇటలీ, జర్మనీ, ఆధునిక కవిత్వానికి నాందిపలికాయి. ఒక అంతర్జాతీయస్పృహ రచయితల్లో పెరిగింది. వస్తువులో మౌలికమైన మార్పుకొట్టవచ్చినట్టు కనిపించింది. ఉత్పత్తి సాధనాల్లో సంకీర్ణత పెరిగి వుత్పత్తిక్రమం విస్తృతమవుతుంది. ఉత్పత్తిలో, జీవితంలో వేగం పెరుగుతుంది. జనసంబంధాలు విశాలమై అత్యధిక జనాభాను క్రియాశీలంచేస్తాయి. ఇదంతా శిల్పాన్ని ప్రభావితం చేసింది. నవల, కథానిక, సినిమా, రేడియో, టెలివిజన్‌లకు అనువైన సాహిత్య కళారూపాలు, కొత్తశిల్పాలు ఆవిర్భవించాయి. సగటు పాఠకుల సంఖ్యపెరిగి ఆవేశసంబంధాలస్థానంలో 'ఆలోచన' రాజ్యాధికారాన్ని ప్రకటించుకుంది. అందుకే 'వచన యుగం' ఆరంభమయింది. చివరకు కవితనుకూడా ప్రభావితంచేసి వచనకవితలనే ప్రజాస్వామ్య రూపమేర్పడింది.

వస్తు, శిల్పాల్లో కీలకమైనఅంశం వస్తువే అని అనుకున్నాం. సమాజంలో ఏ చిన్నమార్పునయినా సాహిత్యంలో వస్తువు 'రికార్డు' చేస్తుంది. అలాగే జీవిత విధానం మార్పుకు అభిముఖం అవుతున్నప్పుడు, వస్తువులో గణనీయమైన మార్పులు వస్తాయి. వస్తువులో ఖచ్చితంగా శిల్పాల్లో మార్పులురావు. ఉత్పత్తి సంబంధాల్లో తీవ్రమైన మార్పువచ్చినప్పుడే శిల్పాల్లో మార్పువస్తుంది. ఉత్పత్తి సాధనాలు కొత్తవి ఏర్పడినపుడు నూతన ప్రక్రియలు ఏర్పడే అవకాశంవుంది. సమాజ జీవితం మారినా చాలాకాలంవరకు సాహిత్యంలో పాతశిల్పాలు కొనసాగుతూనేవుంటాయి. పాతవుత్పత్తి సాధనాలు వున్నట్టే ఒకే పాతశిల్పంలో కొంతమేరకు వివిధ వర్గాల జీవితం చిత్రించవచ్చును. పురోగామి స్వభావంగల వర్గాల జీవితావసరాలు అనేక కొత్తవుత్పత్తి సాధనాలను రూపొందించినట్టే వుపరితలంలో అనేకకొత్త రూపాలనుకూడ రూపొందిస్తాయి. నవల, సినిమా లాటివి బూర్జువా సమాజంలో వెలువడిన రూపాలే. బూర్జువా వుత్పత్తి విధానానికి మూలమైన సాధనాల, ముఖ్యంగాయంత్రాలప్రభావం శిల్పంమీద వుంది. బూర్జువాశిల్పానికివేగం, సంకీర్ణత స్వభావాలు. పదబంధాల్లోనూ, పాతమాటలకు కొత్త అర్థాలను కల్పించుటలోనూ, భాషావిషయంలోకూడా కొంత పైపైమార్పువస్తుంది. కథాంశం, పాత్రలు దీర్ఘవివరణలుండి వాటిస్థానంలో భావప్రతిమలు పెరుగుతాయి. సాహిత్యవస్తువులో స్థూలంగా చూస్తే పాతయుగాల

జీవిత మత పరిభాషలోనూ, ఆధునికయుగంలో మానవత పరిభాషలోనూ వివరించటం జరుగుతుంది.

వస్తు, శిల్పాల సమ్మేళన

సాధారణంగా వస్తు, శిల్పాలు ఒక యుగంలోని సాహిత్యంలో సమానంగానే వుంటాయి ముఖ్యంగా శిల్పంలో యుగానికి ఒక శిల్పం వుంటుంది. ఉత్పత్తి రంగంలో కూడా ప్రధానంగా ఒక రకమైన ఉత్పత్తి సాధనంగా ప్రధానంగా వుండటమే దానికి కారణం. శ్రమ సాధనంవలె రచయితకు రచనకు మధ్య ప్రయోగింపబడి రచనకు సహకరించేది ప్రక్రియ

వస్తు, శిల్పాలు రచనలో చాల సన్నిహితంగా కలిసిపోవటం, ఉన్నత విలువలు కల సాహిత్య లక్షణం. నిర్దిష్ట వస్తువు నిర్దిష్ట శిల్పంలోనే వ్యక్తమవుతుందన్నంత సహజంగా, దృఢంగా మంచి రచనలో వస్తుశిల్పాలు కలిసిపోతాయి. ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసిన ప్రముఖ రచనల్ని పరిశీలిస్తే ఈ విషయాన్ని గ్రహించ వచ్చును. ఆ రచనల శిల్పాన్ని మార్చి ఆ వస్తువును అలాగే చిత్రించటం సాధ్యంకాదు ఒక సాంఘిక దశ శిధిలమై కొత్త శక్తులు వికసించక పూర్వదశల్లో క్షీణ యుగాలు అంటాం. ఇలాంటి యుగాల్లో శిల్పానికి వస్తువుకు వైరుధ్యం వస్తుంది. కేవల శిల్పవాద ప్రాధాన్యం పెరుగుతుంది. వాస్తవానికి ఇలాంటి సందర్భాల్లో వస్తు, శిల్పాలు రెండూ క్షుద్రంగానే వుంటాయి. బాగా పాతపడి, ప్రభావం చేసే శక్తిని కోల్పోయిన వస్తు శిల్పాలు క్షీణ యుగంలోవుంటాయి. పాలకవర్గాలు ఆ వర్గాల కళా సాహిత్య నిపుణులు సాహిత్యంలో శిల్పం ప్రధానమనే వాదాన్ని బలంగా ప్రచారం చేస్తారు. ఆ విధంగా వస్తువులో నవ్యతరాకుండా ఆటంక పరచటమే వాళ్ళ వుద్దేశ్యం. కొత్తగా పుడుతున్న వర్గాల భావాలను రచనల్లోకి రాకుండా అణచివేయడం ఈవాద సారాంశం. దేశ దేశాల్లోని ప్రగతి వాద విప్లవ రచయిత ఈ శిల్ప వాదాన్ని నిరాకరించి, అధిక సంఖ్యాక ప్రజల్లోకి సాహిత్యాన్ని తీసుక పోవటాన్ని దృష్టిలో పెట్టుకుని, శిల్ప ప్రాముఖ్యాన్ని పరిమితం చేయాలి. ప్రజా ప్రక్రియలను, ప్రజల నుడికారాన్ని చేపట్టి, ప్రజలకోసం ప్రజా సమస్యల్నే వస్తువుగా నిర్మించాలి.

సాహిత్యానికి గల విప్లవకర శక్తి

సాహిత్యం వుపరితలం అంటే అది ఏ విప్లవ బాధ్యతను నిర్వహించలేదనే జడాత్మక నిర్ధారణలను చేయకూడదు. ఎందుకనంటే, వుపరితలంలో జరిగే నిర్వి

రామ పోరాటం, పునాదిలోనే జరిగే పోరాటం అవిభాజ్యం గానే వుంటుంది. ఇవి పరస్పర ప్రభావం చేసుకుంటాయి. సాహిత్యంలో ప్రధానమైన భాష వుపరితలం కాదు. ఎందుకనంటే, సమాజ దశలు మారుతుంటే భాష మారటం లేదు. భాషలో విప్లవాలంటూ వుండవు. ఒకే భాషలో బూర్జువాలు తమ సిద్ధాంతాలను, కమ్యూనిస్టులు తమ సిద్ధాంతాలను చెప్పవచ్చును. కాబట్టి సాహిత్యం పాక్షికంగా వుపరితలం. విప్లవ కవిత్వంలో శిల్పం లేదనే వాదం విప్లవ వస్తువును నిరాకరించే ముసుగువాదం. శిల్ప దృష్ట్యా తక్కువ రకం కవిత్వం అన్ని యుగాల్లోనూ, అన్నిరకాల కవిత్వాల్లోనూ వుంటుంది. ఈ స్థితిలో విప్లవ కవిత్వం వస్తు ప్రధాన కవిత్వంగావున్నా సమంజసమే. శిల్పం పేరుతో ప్రజావస్తువును ఫ్యూడల్, బూర్జువా ప్రక్రియల్లో ఇరికించటం సరియైనదికాదు. అది సాహిత్యంలో రివిజనిజానికి దారితీస్తుంది. వస్తువులో కరిగిపోయేదిగా వుండే శిల్పాన్ని మనం చేపట్టాలి. పురాణం, ప్రబంధం వంటి మృతప్రక్రియలనుతప్ప, అన్నిటిని విప్లవ రచయితలు వుపయోగించుకోవచ్చును. ముఖ్యంగా పాలకవర్గాల ఫాసిస్టు ధోరణులు రచయితలను అణచివేయటానికి పూనుకున్న ఈ సందర్భంలో వ్యంగ్య రచనలు చాల వుపయోగపడతాయి.

★★

కన్నీళ్ళు

—ఎన్వీ

ఖరీదులేని కన్నీటినికూడ
ఖర్చుపెట్టని పిసినారిలోకం ఇది
కన్నీళ్ళు కావాలంటే మాత్రం
కార్చేప్రతి కన్నీటి చుక్కకు
ఖరీదుకట్టి అమ్ముకునే వ్యాపారులు
ఇక్కడి మనుష్యులు.

ఒక తారక రాలినంతలో ....

— మల్లిక్

ఒక తారక రాలింది:

విషాదాల సముద్రాన వెరపులేక విహరించే

విప్లవాల నావ కోసం దారిచూపగ నిల్చినట్టి

అరుణతార నేల రాలింది.

ఒక దీపం ఆరింది;

వేనవేల హృదయాలలో ఆశయాల జ్వాలలను

రగిలించిన, వెలిగించిన ఆ దీపం ఆరింది.

ఒక హృదయం ఆగింది;

కోట్లకొలది కష్టజీవుల వెతలుతీరే వెరవు చూపిన

ఆ హృదయం స్పందించుట మానింది.

ఒక కంఠం పలికింది;

ఒక హృదయం ఆగినంతలో,

ఒక దీపం ఆర్పినంతలో,

ఒక తారక రాలినంతలో,

ఆశయాల జ్వాలలెన్నడు ఆరిపోవు, ఆరబోవని

విప్లవాల నావ తప్పక దరికిచేరి తీరుతుందని

ఈ గొంతుక పలికింది.

(1976 సెప్టెంబర్ 9 న కా॥ మావో మరణించాడనే విషాద వార్త విని)

సికింద్రాబాద్ జైలు

10-9-76.

రాత్రిలో యోధుడు

— కె. రాంమోహన్ రాజు

నగరం సమస్తం మత్తుగా నిద్రిస్తున్న వేళ
జైలుగంట నాలుగు మోగుతుంది
ఓహో ఖైదీ ! ఓహో ఖైదీ !!
ఈ గాలిలో నీ నినాదాల ఉష్ణత్వం ప్రకంపిస్తున్నది
నీ చేతి సంకెల ధ్వని జగతి మీద చైతన్య
వర్షం కురిపిస్తున్నది
రాత్రి కుంపటిలో రాజుకునే కణాలు
ఈ నక్షత్రాలు
మేం నిలిచి పిలుస్తాం
వేరు దారిలేదు కదులుతాం జై అని!
ఇదంతా ఒక మసక
ఉదయానికి విచ్చిపోతుంది
వీళ్ళ తోలుబొమ్మలాట ఇక ముగుస్తుంది
ధాత్రీ వదనం చీలి సర్రెల నుంచి
భయంకర విస్మృత రహస్యాలు వెలికి వస్తాయి.
ఏచోట ఏమలుపు తిరిగినా
నువు నా కాదేశించిన సూత్రం
నన్నిలాగ కదిలిస్తూ నడిపిస్తూవుంటే
ఎలాగ నీ స్మృతి మరిచిపోగలను ?

"దేశాలు స్వాతంత్ర్యాన్నీ
జాతులు విముక్తినీ
ప్రజలు విప్లవాన్నీ కోరుకుంటున్నారు"

ఎర్రని చుక్కలకు....

— భూపాల్

ఆకాశ మందుండి హాయిగా ఎగిరేటి
పక్షులారా ! మీకు పువ్వులిస్తాము
ఎర్రనీ చుక్కలకు ఎక్కించి రావాలి
మీ వాళ్ళు పంపిరని చెప్పి రావాలి... ॥ఆకాశ॥

పరుపు చింతల్లోన చింతలేకున్నావు
వాడి కన్నుల తల్లి ఓ పైడికంటీ !
జువ్వి పువ్వుల రాశి దండిగా పేర్చాము
గుండె బాధకు గుర్తు అందించి రావాలి !... ॥ఆకాశ॥

కొమ్మల్లా కోనల్లా 'కో' యంటె 'కో' యనే
కమ్మనీ గొంతున్న ఓ ... కోకిలమ్మా !
ఎర్ర మందారాలు ఏరి ఉంచామమ్మ
'దండాలు ఎరుపు' వని అందించిరావమ్మ !... ॥ఆకాశ॥

చిట్టి వాళ్ళము పిలువ చెట్టు దిగిరావాలి
పంచరంగుల పిట్ట ఓ ... పాల పిట్టా !
మల్లె పువ్వుల దండ మెడనిండ వేస్తాము
మాకంటి వెలుగులకు ముట్టజెప్పొస్తావ ?... ॥ఆకాశ॥

మావిళ్ళ తోటల్లా మసలేటి గోరొంక !
పలుకు పలుకున తేనెలొలుకు తావే
ఎర్ర గన్నెరుపూలు ఏరి ఉంచామమ్మ
అశ్రు వొక్కొక్కటిని అందించి వస్తావ ?... ॥ఆకాశ॥

వెండిగజ్జెలు కడుదు మెర్రనీ కాళ్ళకూ
పసిడి నడకల తల్లి ఓ — పావురాయి !
సంపెంగ పూగుత్తి కొత్తగా పేర్చాము
మృత వీరులా ముందు ఉంచి వస్తావ ?... ॥ఆకాశ॥

(విశాఖపట్నం సెంట్రల్ జైలు)
8-8-1976

పెద్ద కథ:

ఎదురు తిరిగితే...

— అల్లం రాజయ్య

(కరీంనగర్ జిల్లా, మంథెన తాలూకా, గాజులపల్లి గ్రామంలోని ప్రజల భాష ఈ కథలో వాడబడింది.)

"దండమయ్యా పటేలా" అంగి[1] దండం బెట్టిండు పోశమల్లు. ఆ వెనుక సేతులు పిసుక్కుంట నిలబడ్డడు పోశమల్లు ఎనుక మాదిగగూడెం సిన్న, పెద్ద నిలబడ్డరు.

ఇంటిముంగటి గద్దెమీన కూకుండి పండ్లు తోముతున్న నరసయ్యా తుపుక్కున ఊంచి మారు దండం బెట్టకుంటనె "ఏందో సెప్పుర్రా..." అన్నడు.

"నువ్వు సెప్పరాదుర పెదకొంరా..." కర్రెపోశడు దూరంగా కింద కూకుండుకుంట అన్నడు

మందిని జరుపుకుంట ముంగటి కచ్చిండు నంబర్ కొంరడు.

"పటేలా గదే[2] బాంచెన్, ఆనాడేదో బుద్ధి గడ్డి తిన్నందుకు దొరోరు నీరటి బిచ్చం[3] ఎగబెట్టింరా? తోలాలిసి ఆఖరికి అమీన్ కచ్చీర్ల[4] పెట్టిన సంగతి మీ కెరుకేనాయె... ఇయ్యేడు తొంటకొంరని కొడుకు లింగడు, తాస్సె దుగ్గికాడుకు కర్రెలింగడు కల్సి కన్ రెడ్డి కుంటెనక నీరటి తనము జేసిర్రు కదుండీ! దొరోరు ఏడాది పొంటనీళ్ళు పెట్టిచ్చుకొని ఆఖరికత్తె[5] జీతమెగ బెట్టిర్రు..." కొంరడు గుక్కతిప్పుకున్నడు.

---

1. వంగి 1 A. ముందుకు 2. అదే 3. పొలానికి నీరుపెట్టినందుకు కూలీ 4. (అమీన్ కచ్చీర్ల) పోలీస్ స్టేషన్లో 5. చివరకువస్తే.

"ఆదెరికేనురా, దొరోరి[6] సంగతి ఎవ్వలకు తెల్వదని? దానికొరకేం జెయ్యలోన్నె సెప్పరా" పండ్లపుల్ల దూరంగా ఇసిరేసి నర్సయ్య బోడగుండు మీన్నుంచి తొంటసెయ్యిని పోనిచ్చి ఉండీ లేనట్టున్న జుట్టుపోసను దొరుక బట్టి దాన్ని దువ్వుకుంట అన్నడు.

"నువ్వాగుర కొంరా...ఇగనేఁ జెప్పత..." పోశమల్లు ముంగటికచ్చిండు[7].

"నర్సయ్య పటేలా! ఏటా కన్‌రెడ్డికుంటెనుక అయిదుగిద్దెలు పెట్టేసంగతి మీ కెరుకేనాయె. సిల్లర, మల్లర ఇద్దూమత్తె,[8] మూడు గిద్దెలు కొత్తదొరయే నాయె, ఆయింత మూడు గిద్దెలు ఎగబెట్టి్రంటె కుంట బట్టినోని నోట్లె మన్నె గదా! ఈన్దికొద్దిగా మోరుదోపని, అదిగాక ఎనకటినుంచి ఈనయ్య కులపెద్ద గదా అని పెద్దజేత్తే ఓట్లప్పుడు కోమటి కిట్టయ్య పటేలు దగ్గర్నుంచి కచ్చెడు గడ్డి దెచ్చుకున్నడు. పోనియ్యి అని ఊకుంటె నాటి, నాత్రి లేసి దొరోరి దొయ్య[9] కట్టుకచ్చిండు. ఈడు సెయ్యవట్టి దొరోరు తొంటకొంరని కొడుకు లింగనికి, కర్రె లింగనికి ఏడాదంత నీళ్ళు పెట్టిచ్చుకొని నీరటిబిచ్చము ఎగపెట్టి్రు, ..." పోశమల్లు కొంరని తప్పును ఎత్తి సూపిచ్చుకుంట సెప్పిండు.

మందిని జరుపుకుంట తొంట కొంరని కొడుకు లింగడు ముంగటికచ్చిండు. ఆనెనుక ఆని అవ్వ[10] గట్టు మల్లి, నర్సయ్య ముంగటి కచ్చింది...... ఆళ్ళిద్దరు కాల్లకాడి నేలమీన రెండు సేతులతో ముట్టుకొని మొక్కి్రు.

"నీ కాల్ల కిందోల్లము బాంచెన్ నిలువుతా ముంచి్రు నా కొడుకును" గట్టు మల్లి సక్కగ నిలబడి అన్నది.

"దెహెఁ నువ్వట్లాగరాయె..." లింగడు కసిరిండు.

"నువ్వట్లుండరాదు రా బాంచ కొడుక, పటేలుకు కట్టసుకము సెప్పుకుంటాంటె నీకెందుకురా? గిట్లసేసే ఇల్లు ముంచినవ్... ఏడాది పొడుగుత కట్టబడి

---

6. దొరవారి 7. వచ్చినాడు 8 రెండు తూములువస్తై (తెలంగాణలో ధాన్యం కొలత) 9. దొయ్య పొలం (?) 10 అమ్మ.

పోరగండ్లను కూడులేకుంట సంపుతంటవి. మాదండి 'మొగోడచ్చిండు మంచ మెల్లులుక [11] లేయి అన్నదట' నీకెప్పుడు ఉరుకు లాటె..." సేతులు ఆరుసుకుంట లింగన్ని కసిరింది...

లింగడు ముఖం మాడుసుకున్నడు.

"ఊకోయె [12] గట్టు మల్లి... ఆఁ... ఏందిర లింగ...?" కిందికి మీదికి నాలుగుసార్లు గురుకపెట్టి [13] తుపుక్కున ఊంచిండు.

"మీకు సెప్పేటోన్న బాంచెన్. కొంరడు సెయ్యవట్టయితేంది ? దొరోరు సెయ్య వట్టయితేంది? నా పోరగాండ్ల కడుపుల మీన కొడుతాౖరు. పిల్లలు గల్లోన్ని బాంచెన్, ఆరుగాలము [14] కట్టబడ్డను బాంచెన్ నాకచ్చే ఇత్తులి [15] ప్పియ్యౖరి బాంచెన్..." నర్సయ్య ముఖంలకు దీనంగ సూసుకుంట అన్నడు లింగడు.

"మీరంత ఏమంటౖరా..." నర్సయ్య మాదిగోళ్ళ కెల్లి సూసిండు.

"పెద్ద మనుసుల్ని కుప్ప జెయ్యిమన్నమ్. పెద్దలోకులు ఇసారించి తప్పు నిర్నాయము జేయిౖరి బాంచెన్" గడిపెల్లి జక్కడు గుతుప కట్టెను నిలవొడిసి దానిమీద గద్దువ [16] ఆన్చుకొని నిలబడి అన్నడు...

"అయితే పోశాలుకు, కిట్టయ్యకు సెప్పిరాౖ ... " నర్సయ్య లేచి నిలబడు కుంట అన్నడు.

"తవఁరికే ముందుగాలు సెప్పాలని అచ్చినం ... బాంచెన్ ..." తొస్సె దుర్గి కొడుకు కౖరె లింగడు అన్నడు.

"సరె సెప్పు ర గని [17] నాకియ్యల్ల తీౖరదో ? తీరదో ? పెద్దకొడుకు నూర్లకు నూర్లు, ఇమ్మడికి ముమ్మడి ఎదురుబియ్యం బత్తాలు [18] కొంచబొయ్యి పట్నంలో

---

11. వెల్లకిల 12. ఊరుకో 13. కాంౖడించి 14. ఎల్లకాలము
15. గింజలు (విత్తనాలు) 16 గడ్డం 17. కాని 18 బస్తాలు.

సదువుతున్నడాయె ... సిన్నకొడుకులిద్దరు ఇంకోకాడ సదువుతున్నరాయె ... పాలేర్లున్నరు, ఒకడు తాళ్ళల్ల [19] పంటె ఇంకోడు ఈదులల్ల [20] పంటడు. నేను సేతకెల్లి [21] బోంది ఎల్లదాయె, సడుగు [22] గుత్తబడితె ఎవ్వళ్ళు అటు మొఖాన అచ్చిన పాపానపోరు ... సుప్పరబేగ్ ఆత్తె నర్సయ్యేడి అని నన్నే అడిగె - టేపేసి కొలుత్తే లెక్కలు సేసుకుంట ఎంటబోవన్నాయె ... నాకెక్కడి తీరిక ... అయిన అత్తననుకో. ఇయ్యల్ల కలువదిగని [23] రేపు సూత్తాము ... పోశాలును, కిట్టయ్యను, దొరోరిని ఉండుమనుర్రి. రేపు అంబటాల్లకు [24] భూలచ్చిమికాడ మీ పంచాతి తెంపుదాం ...'' కాంద్రకిచ్చి ఊంచి ఇంట్లకు నడిసిండు నర్సయ్య ...

"బాంచెన్ రేపాల్లంత ఉంటర ? దొరోరుగుడుక [25] ఇంటికాన్నే ఉన్నరట,... పోశాలు పటేల్, కిట్టయ్య పటేల్ గుడుక ఉన్నరట బాంచెన్...తమరుగుడుక ఉండక బోతే కాదు బాంచెన్..." కర్రె లింగడు పెద్దరువాజ [26] కాడ నిలబడి మొక్కిండు...

"కలువదంటలేనుర ... నేనేమొ ఖరాకండి మనిసిని. మాటా మరోటా ? నోరా తాటిమట్టా ?" కిర్రుసెప్పులు పందిరికింద ఇడిసి "నీల్లావలికి బట్టే! ..." ఇంట్లకు కేకేసిండు...

లింగని కెటు దోసలే, అట్లనె నిలబడ్డడు ...

ఇంట్లనుంచి బయటికి వచ్చిన రామక్క "ఊకే [27] పంచాయితిలే పనా బట్టా...? అవతలోల్లు ఏ గంగల పోతేంది ?... " ముఖం చిట్లించింది.

"నువ్వ ససరాదే[28] ... లింగా ! అయితే పగట్నించి సేద్దాము ... ఓ కయికిలోన్ని [29] బెట్టి మా గుట్టకింది పెరడికాడికి పొమ్మను" నర్సయ్య అసలు విషయం తేల్సిండు.

---

19. తాటిచెట్లు 20. ఈతచెట్లు 21. పనికి 22 రోడ్డు. 23. కుదరదుకాని 24. భోజనం వేళకు 25. కూడ 26. పెద్ద తలుపు 27. ఎప్పుడూ 28. ఆగరాదు? 29. కూలివాడ్ని.

లింగని మొఖము మాడి పోయింది. ఇంట్ల తినేందుకు ఇత్తులు లేంది కయికి లెట్ల పెట్టగలుగుతడు పాపం ...అయినా ఆశ...దొరోరిచ్చే అర్ల[30] మీన ఆశ... అప్పో, సప్పో సెయ్యాలనుకుని నర్సయ్య దొడ్డ బుద్ధికి మొక్కి ఎనుకకు తిరిగిండు

"ఏందిరో లింగ! ఇయ్యేల్ల అందరి కయికిల్లు పోవాలంటవ? పొద్దుందనుక[31] ఎట్ల కలుత్తదిర ?..." అన్నరు మాదిగోళ్లు.

"ఎట్లర్రా గింత ఎట్లన్న జెయ్యిర్రి..." లింగలిద్దరు బతిలాడిరి.

నంబరు కొరండు లేసి బుస బుస లాడుకుంట బూతులు తిట్టుకుంట ఎల్లి పోయిండు.

అడెనుక మాదిగోళ్ళంత కదిలిరి...

*   *   *

2

ఏపసెట్టు గద్దెమీన పోశాలు కూకుంది. మోకాళ్ళకు పంచెసుట్టుకొని సుట్ట తాగుతండు... ఆయినె పక్కకు నర్సయ్య సెట్టుకొరిగి కూకున్నడు- ఏప పుల్లను పండ్ల సందుల్ల పెట్టుకుంట. ఓగెలు గద్దె కింద దుబ్బల్ల కూకున్నరు.

సర్‌పంచ్ కిట్టయ్య గడెంచలో[32] కూకుండి బీడి పల్లసందుల్ల పెట్టుకొని పిడికిలి మలిసి తాగుతండు.

గద్దె కెడుమకెల్లి[33] దూరంగా మాదిగోల్లంత కూకున్నరు కుప్పగ మూల తిరుగుడుకాడ మాదిగి ఆడోల్లు గుడిసె సూరుకింద మాసిన పేగులు కట్టుకొని నిల నిలబడ్డరు.

దూరంగ మాదిగోళ్ల పోరగండ్లు దుమ్ములో ఆడుతన్నరు.

"సుంకరి నర్సిమ్మడు జాడ పత్త లేకుంట పోయిండు. గాంధచ్చి సవరా

---

30. వద్దు, 31. దినమంతా, 32. చిన్నమంచము,
33. ఎడమవైపు.

జైమని బొత్తిగ భయం భీతి లేకుండ సేసిండు. లంజకొడుకులంత మాట ఇనకుంట అయిరుఫ్రి..." సుంకరోని కోసం బజార్లకు సూసుకుంట అన్నడు పోశాలు...

ఏపసెట్టుమీన కాకులు, గొర్రెంకలు రొదపెడ్తున్నయి. ఏపచెట్టు ఆకులు రాలిసింది. కొమ్మల సందుగుండ సూరీడు తొంగి సూత్తుండు.

సుంకరి నర్సిమ్మడు కొశ్శెటి[34] బరిసె ఎడమసేత పట్టుకొని అందరికి దండాలుసెప్పి నిలఖడ్డడు.

"లంజకొడుక ... ! గింతసేపేంజేసినవురా ?" కిట్టయ్య బీడికొస దులిపు కుంట గదమాయించిండు.

"గట్లంటెట్ల[35] బాంచెన్. పొద్దిట్నుంచి నోట్లె మంచినీళ్ల పొయ్యకుంట తిరుగుతనే ఉంటి ... సేన్లకాడికి పోయినోల్లు, గుంటుకులక[36] పోయినోల్లు - జను సేసెటందుకు గింతసేపు పట్టె ... ఆడికి చిందొర ఇంక తానము సేయలేదన్రని." సుంకరి నర్సిమ్మడు దూరంగ జరిగి జునుకుకుంట అన్నడు.

"నీ అంతుకు మేమే సుంకరితనము సేత్తముగని పల్లెమీని పెద్దొర దగ్గర కెల్లి జెప్పన[37] పిలుసుకురా ... " నర్సయ్య హుకుం జారీ చేసిండు.

నర్సిమ్మడు దొరోరి ఇంటికెల్లి ఉరికిండు ...

"దొరెచ్చేటల్లాకు మీ సంగతేందో సెప్పుర్రా మాదుగులు ... " పోశాలు.

"మీ కెరుకలేందా బాంచెన్ ? ... " పిర్రలగట్టడు గునిసిండు.

"ఎరికేరా ? నాకొక్కనికెరుకే ? నాకొక్కని కెరుకుంటె మాత్రం ! కాకుంటె ఈ మందిలో నర్సిమ్మని కెరుకుండచ్చు ... కాదురా నర్సిమ్మా ?" నర్సయ్యతోని పోశాలు అన్నడు.

---

34. మొనదేలిన 35. అలాఅంటెఎలా 36. పొలం చదును పనికి 37 వెంటనే.

"అదికాదు పోశాలు ... " మజ్జెలో తుపుక్కున ఊంచి "మనకెరుకుంటె ఎరుకున్నది గని ఇక్కడ కూకున్న నలుగురు ఇనాలెగద ? నలుగురున్నకాడ నారాయుడున్నడు. అందరేమంటరో ? ... " మందికెల్లి సూసిండు నర్సయ్య.

"మీకంటె ఇక్కడ ఎవ్వల కెక్కువ తెలుత్తది ?" లసుమయ్య నడిమందిల నుంచి అన్నడు

నర్సయ్య నలుగురిజోలి తీసింది ఈ మాట కోసరమే.

"ఎట్లయిన మాదిగ లంజకొడుకులకు కావురమచ్చిందిగని, కండ్లునెత్తి మీని కెక్కినయ్ — మొన్నటికిమొన్న అయ్యగారి బాయికి నీళ్ళు సేదుకొంటమని గుజి కట్టుకొని అచ్చిరు. అవ్వల మిండల సొమ్మయినట్టు " ఓదెలు మాది గోల్ల మీని అక్కసంత ఎల్లగక్కిండు.

"బాంచెన్ గులా పోల్లము[38] ...ఇన్నేండ్లబట్టి మీ బాయికి నీల్ల కచ్చినమా ? బూరుగాగు[39] బొబ్బలు కొట్టినా—మంచినీళ్ళేక సచ్చినమ్‌గని; లద్దు, మురుకులు గతికితిమి. మీకండ్ల ముంగట్నె బూరుగాగంత ఇయ్యేడు ఎండిపోయింది గద్దురి ...అనదేవుడు ముంచె...ఏడ సాపుమంటరు ? బాంచెన్. సర్కార్ కట్టిచ్చి గిరుక[40] లేసిర్రని నీల్లకత్తిమి...ముందుగాల నీపెండ్లం పియిడింట-లసుమవ్వను సేదెడన్ని నీళ్ళుమొయ్యి మంటెతండ్రి కయ్యకేర్గ[41] గులాపోల్లము మేము గిరుకకు సేదు కుంటమంటె-దుడ్లు తీస్కచ్చి ఈపులన్ని మెతిపితిరి. ఆకరికి అరి మడ్లల్ల[42] పొక్కదోడు కుంటిమి... నీ బాంచెన్ గసొంటి[43] కరువు కాలాలొత్తే ఏడ పొదుము." సమ్మడు తమదేమి తప్పుగాదని నచ్చసెప్ప సూసిండు.

"అదంటె పోనియ్యి—బొత్తకొంరని బలుపు మదము గాకేంది - ఆడే దొంగతనము జేత్తడు. ఎందుకు జేసినవ్‌రా?' అంటె "కడుపుగాలి" అంటడు. దొరోరు నీరడిబిచ్చం ఎగ బెట్టడా మరి ? కావురంకొద్ది అడ్లకచ్చులాల[44] కడ్డం బోయి కనాలూడబీకె[45] 'బిచ్చం బెట్టే దనుక కచ్చులాల కదులనియ్య'నంటడు...

౩౮. గులాములము ౩౯. బూరుగు అను వాగు 40. గిలక 41. తిట్టెను 42. వరిమళ్ళలో 43. అటువంటి 44. కచ్చరం (బండి) 45. ఎడ్లను కాడికిబిగించి వుంచే కర్రలు.

ఈడు లేసినేల్లమంచిది. దొరోరు ఏకాల్లి[46] లున్నరో కర్నెకోల కట్టందుకొని పిల్లిని పొడిసినట్టు పొడిసోసెటోరే- ఈపు మెతిపి ఇడిసిపెట్టిర్రు- అడికి దొరే దమ్ము మింగిండు—తెల్లారి పంచాతుకు పిలుత్తే 'ఏదో బాంచెన్ ఇన్ని కల్‌సిల్లుదా గినంటడు'-గిన్ని సేసినంక ఇగమాదిగోళ్ళకు సీరటి బిచ్చం ఎట్లాపెడుతరు?" ఓదెలు తుపుక్కున ఊంచి "మాదిగ లంజకొడుకులు పాపమన వశమాః" అని తేల్చేసిండు.

మాలి పటేలు మాదవరెడ్డి బీడి కాల్చుకుంట అచ్చిండు.

మాదిగోల్లంత లేసి నిలుసుండి దండాలు పెట్టిర్రు. గుంపులనుండి ఒకడురికి ఎవ్వలనో గడెంచడుకచ్చి దొరకేసిండు.

దొర గడెంచలో కూకున్నడు.

"ఇంక పెద్దొర రాలే... నర్సిమ్మ డేడబోయిండు..." బీడి మొక్కని ఇసిరేసి అన్నడు.

"అడికే తోలించన మర్రి" పోశాలు సదురుకొని కూకుండి అన్నడు..

"తాంట కొంరని కొడుకు లింగడు- కర్రె లింగడు అచ్చిన్రా?" మాదిగుల కెల్లి సూసుకుంట అన్నడు.

"అచ్చినమ్... బాంచెన్..." జెరముంగటికచ్చి కూకున్నరు.

"బొత్తకొంరడేడి!" దొర.

భూలచ్చిమి ఎనుక కూరుకుతున్న కొంరన్ని ప్రక్కకున్న పెద్దిగాడు లేపిండు... ఉలికిపడి "ఓయ్..." అన్నాడు అదురుదగ.

"బంచెత్... ఓ యేందిరా ? బామ్మరిది నన్నట్టు ! పెద్ద మనుసుల్ని పంచాతికి పిల్చి నిదురపోతున్నవ ? సువ్వర్![47] ..." మాలి పటేల్ మాధవరెడ్డి.

"సీ కాలు మొకుత బాంచెన్-నాత్రి నిదురలేదు. కల్లం[48] కాడ కావలున్న-" కొంరడు.

"పంచాతేందిరా ?..." కొంరని తోని దొర.

---

46. ఆలోచన. 47. పంది (తిట్టు) 48. కోసినపంట

దొరోరి కుంటక్రింద తను నీరటి క్తీతనము సేసిన కాన్నుంచి సివరిదనుక సెప్పు కచ్చిండు కొంరడు.

ఇంతట్లకే మొఖం ఏల్లాడేసుకొని అచ్చిండు- దొరోరి ఇంటి కెల్లిన సుంకరి నర్సిమ్మడు.

"ఏమాయెర నర్సిమ్మా ! దొరేమన్నడు ?..." పోశాలు.

"నీ కాలు మొకుత పడేలా ! గియ్యాల్ల [49] కాపోల్లు, పెరోకల్లు పంచాతి సెప్పెటోల్లయింగ్రా ? అల్లకాడికి నేనురావన్నా అనుకుంట - మీది కురికచ్చింగ్రు జాంచెన్ ..." నర్సిమ్మడు అసలు సంగతి తేల్సిండు.

కాసేపు ఎవ్వలు మాట్లాడలేదు

"దొర రాకుంటె ఈడ ఆగేదేమున్నదిగనుక ? నర్సయ్యా ! పోశాలు ! ఈల్ల పంచాతి మనమే తెంపుదాం ..." మాలి పటేల్ మళ్ళో బీడి ముట్టించిండు.

పోశాలు, నర్సయ్యకేగాదు ఆడున్న ఎవ్వలకు దొరోరు లేకుంట పంచాతెట్ల తెగుద్దో సమ్జు [50] గాలె. ఒకరి ముఖా లొకరు సూసుకున్నరు.

"దొర పొలంల దొంగతనము సేయటం కాన్నుంచి దొర బండ్ల నటకా యించడం దాక బొత్తకొంరందే తప్పుగద. ఈల్ల నీరటి బిచ్చెము ఎగబెట్టటాన్కి గుడుక ఈడె కారణంగద - ఏమంటరు పోశాలు ? నర్సయ్యా ? ..." రెడ్డి పెద్ద పెద్దమనుసులిద్దరిని ఇరకాటంలో పెట్టిండు.

"ఆదిగాద్దొర..." నర్సయ్య ఏదో అడ్డుసెప్ప బోయిండు.

బొత్తకొంరని ముఖంల నెత్తురుసుక్కలేదు.

"ఏదిగాదయ్యా ! సాలుసెప్పు ధర్మరాజు అంటె దుడ్డె, బర్రె నాదేనన్నడట ఎనకట ..."

సాలు సెప్పేదెవ్వలో ? దుడ్డె, బర్రె ఎవ్వలదో సమజ్‌గాక నర్సయ్య, పోశాలు బిక్కమొఖం ఏస్నిరు.

ఓదెలు దొరవాలుకం కనిపెట్టి "దొరోరు అనేటిదేందంటె బొత్త కొంరడు, కర్రె లింగడు, తొంటకొంరని కొడుకు లింగడు కలిసి పంచాతి తెంపుకోవాలె. అంతేగాదురి దొరా ?" సాగదీసిండు

---

49 ఇవ్వాళ 50. అర్థం.

"అద్గది ... ఓదెలు నువ్వు సరిగ్గా తెలుకున్నవోయ్" మాలి పటేల్ ఓదెలును మెచ్చుకున్నడు.

"దొరయ్యకుంటె నేనేం జెయ్యాలె బాంచెన్..." బాయిలనుంచి మాట్లాడినట్టు బొంగురుబోయిన గొంతుతోటి అన్నడు కొంరడు.

"ద్దెత్తెరి ... పెద్ద లోకులముంగట నువ్వేం మాట్లాడ్తన్నవు ... ఆల్లకెరుకలేదా?..." పోశమల్లు దొరకు కోపమత్తదేమొనని కొంరన్ని కసిరిండు.

"లంజకొడుక... నీ పెండ్లాన్ని "—....."నేనేం జెయ్యాలంటన్నవ? సెప్పబట్టి పండ్లూడగొడుత—నువ్వు జెయ్యంగ కాదుదొర కోపాని కచ్చింది?" మాలిపటేల్ దొరోరినెనుకేసు కొని ఉరిమిండు.

కొంరని శరీరం కుతకుత ఉడికింది...

"కోపానికి రాకుర్రిదొర... పంచాతిసేద్దాం..." నరసయ్య నసిగిండు.

సెప్పమన్నట్లు మాలిపటేలు ఓదెలుకు కన్నుగీటిండు.

"మాదిగలంజకొడుకు లాలా! సెరో యాభైరూపాలు దడావతు[51] పెట్టుర్రి పంచాతి నడుత్తది." అసలు విషయం తేల్చిండు.

"నీ బాంచెన్—సంకలే ఒడితె కార్జముగన్పడ్తది. పెయ్యంత గొడితె పెరుక్కు పెద్దకొత్తెల్లది ముచ్చిలుకలకు [52] యాభైరూపా లెక్కడ తెత్తమ్రుర్రి?" తొంటకొంరని కొడుకు లింగడు భయంగ అన్నడు.

"ముచ్చిలుకలు లేంది పంచాతెట్ల నడుత్తది? అయితె మీకు మీరే సేసుకొండి, మజ్జెన మమ్ముల్నెందుకు పిలిస్రిరు?" — మాలిపటేల్ లేచినిలబడ్డడు.

"కూకోర్రి... యాభై అంటే ఈఅగ్గెనగాల్ల [53] మాదిగ లంజకొడుకు లెక్కడదెత్తరు? ఏదో నలుభైకాడికి సేద్దాం" – పోశాలు రాజి కుదురుతున్నట్టన్నడు.

మాదిగోళ్ళు మాట్లాడే గుండెలులేక కూకున్నరు. ఈ ఊళ్ళె దడావతు లేకుంట పంచాతి జర్గడం ఆళ్ళెగాదు ఆళ్ళ తాత ముత్తాతలు గుడుక సూల్లే.

51. పూచీ 52. ఒప్పందం రాసి యిచ్చుటకు 53. ఉన్న పళంగా,

"ఏమంటవుర కొంర ? పోశాలేమొ అంటడు ?" ఓదెలు.

కొంరడు బిర్ర బిగుసుక పోయిండు.

"సరే! కొంరడొప్పుకున్నడు. మీరేమంట్రా ?" ఇద్దరు లింగల్లతోటి ఓదెలు.

"బాంచెన్ ..." కర్రె లింగడు నసిగిండు.

"బాంచెన్ లేదు ... గీంచెన్‌లేదు ... నగతుదెత్తరా ? మనుసుల్నొప్పిచ్చుకుంటర ?" ఓదెలు.

"గొడ్డు బొక్కలు దినే మాదిగోల్లకు నగతులా ?..." ఆడోల్ల గుంపుల నుంచి కొంరని పెండ్లం మల్లి ఉండబట్టలేక అన్నది.

"లంజెకాన ! నిన్నెవడు పిలిసిండు ? ఈన్నుంచిపో - రాజ్జాలేలుతర ? పంచాతి కాడికచ్చిర్రు..." సర్పంచ్ కోమటి కిట్టయ్య మల్లిని బూతులుతిట్టిండు...

"అవ్వో !... నీ బాంచెనాతే !... రాజ్జాలేలుతమట ! రాజ్జాలు !..." గునిసి సాటుకు జరిగింది.

"ఏంరా కొంర ?" ఓదెలు మల్లడిగిండు.

"పోశయ్య పటేలా ! ఒప్పుకోర్రి బాంచెన్—" కొంరడు దీనంగా మందిల నుంచి పోశాలు కెల్లి సేతులు జోడించిండు.

"నేను మజ్జెన పడనుర-మాదిగిక్కులము మంచిదిగాదు" పోశాలు ఆనికెల్లి సూడకుంటనె సెయి ఊపిండు.

"నీ పెండ్లం పియిదింట - మీరు కాదంటెట్ల? బాంచెన్." కొంరడు బతిమి లాడంగ బతిమిలాడంగ ఆఖరికి ఒప్పుకున్నడు పోశాలు.

లింగలిద్దరి తరఫున నర్సయ్య జమానతు [54] పడ్డడు.

పొద్దు పడమటి కొండల్లకు పోయెదనుక; కంచెల్లకు బోయిన పసురాలు ఊల్లెకు చేరే దనుక; ఆకులు రాలిన ఏపసెట్టు మీనికి పచ్చులు సేరుకునే దనుక; మర్లేసి, తిర్లేసి, తిట్టి, కసిరి, నాన్పి ఆఖరుకు బొత్త కొంరందితప్పు జేసిర్రు. కొంరడు తప్పు దండుగు కింద, ఇయ్యేటి సీరటి బిచ్చెము మూడుగిద్దెలు లింగల్లిద్దరికి కొలువటమే కాకుంట, నలభై రూపాలు దడావతు కూగ పటేలుకియ్యాలె దేలిండు.

---

54. పూచీ

అంతవరదాక నోట్లె మంచినీల్లన్న బొయ్యని కొంరని కండ్లు బైర్లు కమ్మినయ్... రెండు నిముషాలకు తేరుకుని "పిల్లలు గల్లోన్ని బాంచెన్ దొరా! ఈడికె పూటగడుస్త లేదు. నన్నన్యాయం సేయకండి - బాంచెన్ దొరా!' చెట్టెత్తు మనిషి బోరుబోరున ఏడుసుకుంట మాలి పటేల్ కాల్లకు దూరంగా దుమ్ముల కూలబడి పోయిండు.

మాలి పటేల్ పోశాలు దగ్గర నలుభై రూపాలు తీస్కొని అని మొఖమన్న సూడకుంట ఇంటికెల్లి నడిసిండు.

''కొంరా ... ఐతార[55] మొచ్చెటాల్లకు నలుభై రూపాలు పట్టుకరా!'' పోశాలు ఎల్లిండు

ఎవరితొవ్వల వాల్లే ఎల్లిపోయిండ్రు ... కొంరనికి లేవడానికి శక్తి సాలలే దుమ్ములకూకుండి పోయిండు ... గొడ్లు, బర్రు బజారులో దుమ్ము లేపుకుంట ఎల్లిపోయినయ్. వాని శలీరమంత దుమ్ము నిండింది... వాని బతుకులగుడుక దుమ్ము నిండింది.....

సందె చీకట్లు పడుతున్నయ్– చిమ్మెట్లు పలుకుతున్నయ్ ... కొట్టాలల్లకు సేరుకున్న పసురాలు దుడ్డెల్ను, లేగల్ను సూసుకొని మురిసిపోతు ఒర్లుతున్నయ్.. ..

మెల్లెగ లేచి నిలబడ్డడు.... మూడుపానాదులను ఒక్కసారి కలెసూసిండు... ఈన్నె అళ్ళంత కూకుంది తనబతుకుల సీకటి నింపిండ్రు ..... చీకట్లో బూలచ్చిమి సెక్కబొమ్మలు .... సీకటి .... ఔను సీకటి–మొత్తం ఊళ్ళంత సీకటే...

"అవ్వా–మావ్వా ... బువ్వేయిండ్రి" ... ఎవ్వలింట్లనో పోరగాడు అరుత్తండు నోరుసించుకొని ...

"అని బతుకేసయం ..." మల్ల కలెజూసిండు: "ఈ వాడ సొంట[56] బోతె పెరుకోల్లవాడ. ఈ వాడ కాపోల్లది మరిఈవాడో ... కుమ్మర్లు, కమ్మర్లు, అడ్లోల్లు[57] మొత్తం ఇండ్లన్ని పనోల్లయె. ఇంకకిందికి బోతె నరకం గవులు[58] కొట్టె మురిగిపోయిన మాంసము, పైన ఎగురుతున్న పీతిరి గద్దలు...బొక్కలు కుక్కలు... ఛీ—ఛీ ... ఇట్ల. ఇప్పుడు ఇంటికిబోతె పోరగండ్లకు, మల్లికి

55. అదివారం 56. వెంట 57. వడ్రంగులు 58. కంపు

ఏ మొఖం సూయించాలె? అయితె ఎటుపోవాలె ... సర్పంచ్ కిట్టయ్య.

"మెరుపసొంటి ఆలోచన... తనొక్కోటు తక్కువుంటె—కాదు—కాదు, తన ఓటుతోటె గెలుసిండుగద— ఈ కట్టకాలముల ఆదుకోడ? తప్పకుంట ఆదు కుంటడుగని'— కాళ్ళీడుసుకుంట కాపోల్ల వాడకెల్లి నడిసిండు.

గిదే—ఇదే పోశాలిల్లు...., ముంగట పెద్దరువాజ సుట్టు పడారి[59] గోడ— లోపట సెన్న పెట్టికట్టిన నాలుగిండ్లు — ఈ ఇండ్లకు సున్నం డంగు కొట్టి సేతులు కాయలుగాసి పోయినయ్ — సేతులకెల్లి సూసుకున్నడు.... సేతులుకాయలు గాసి మోటువారి పోయినయ్. సున్నం డబ్బ మోత్తె నెత్తిమీని ఎంటికలు ఊసిపోయినయ్. నెత్తిపుసికిసూసుకున్నడు - నున్నగ తగిలింది ... ఉపాస ముండి, ఉప్పిడుండి బండలు మోసి ఇండ్లు కట్టినమ్ ... సివరకు నంభైరూపా లొప్పుకోలే —

నన్ను పాలేరుంచుకొని నాలుగేండ్ల దనుక ఫెట్టుబడి పెట్టలే - సిన్నకుండ పెట్టి తాలు తప్ప గొలుసిండు ... అంతా తోడుదొంగలు. సెప్పకుంటె ఇనెటోల్లెవ్వలు ? ... గన్ని పనులుచేత్తె బొర్రోడు ... పోసిగాడు అయిలారం పైసలు గట్టుమన్నడు ... కుక్కలు నయం మాడిసెక్కటొక్కటేత్తే ఆజల్మాంతము[60] మరిసిపోదు ... ఈడు మాదిగోడైతెనా ? లంజకొడుకును బొత్తవలుగ్గొట్టి జేలుకు బోదును. అర్నెల్లంటే ... పెద్ద లోకులు ఏంజేసిన సెల్లుతది ... రాజ్జం అళ్ళదేమరి !

పోశాలిల్లు దాటిండు... ఓదెలిల్లు అచ్చింది. గీడు-గీ బట్టెబాజి [61] ఓది గాడు .... తినబోతె తిండికిలేని గీ లంజకొడుకు దొరోరి మోసెయికింది నీల్లుతాగే గీ బద్దుమాసి....దొరోరిమాటలకు తాళాలుకొట్టిండు ఈనికి నేనేం పాపం జేసిన? ఈని బిడ్డను మారుమానపు [62] మొగడు ఇగ్గుకపోతంటె అడ్డందిరిగి సమ్‌జాయించి కాపురం నిలబెట్టిన్నే!.... అందుకనే ఈని గుడిసెపందులు గుడిసెను మించి పోత లేదు. తాడెక్కటో డొకడుంటె తలతన్నెటో డొకడుండడు మరి !....

---

59. పడారి (ప్రహారీ) 60. బతికినంతకాలం, (61. తిట్టుమాట,)
62. మారుమనువు

ఆడుతని నెత్తి బుడుతడు కొడితె బుడతని నెత్తి బోడోడు గొట్టిండంట! దొర అనకముందే ఈడు ఎగిరెగిరి జుట్టు పిట్ట వగుతుగ .... పిడికిల్లు బిగుసుకున్నయ్.

ఓదెలిల్లు దాటిండు ...లసుమయ్య ఇల్లు అచ్చింది ... గీ చింగెం లసుమయ్య పెండ్లం దావఖాం[63] డ్లుంటె ... రాత్రి పగలు ఆనికి తోడుగా ఉండి ఏదిగావా లంటె అది సేసిపెట్టినే! ఒక్కమాట ... "ఆనిది తప్పుగాదని" - అంటె-ఈని ముల్లె మునిగి పోయిందా? ఛత్! బంచెత్! లంగలోకం!.... బట్టె మాజి మనుసులు!

ఇంతట్ల సందుల దీపాలెలిగినయ్... సీకట్ల నడుత్తున్న కొంరని కండ్లకు ఒక్కసారిగ ఎలుగు కన్పించేటాల్లకు కండ్లు కన్పడలే... గీ సర్పంచి కిట్టడు, నర్సడు, పోసిగాడు బట్టెబాజులంతా - ఏదో ఒరుగ పెత్తదని కంబాలు[64] లేవట్టనీకు, పొక్కలు తోడనుకు తీగెలిగ్గెటందుకు పుక్కానికి[65] తీస్కపోయిన్రు.... ఆకలితో సైన పోయినమ్.... సవ్వుల్లమీన[66] దీని తస్సదియ్య పుర సెయిమట్టి మీన కంబముబడి అయిదురోజులు వాత్తె నాపోరగండ్లు ఉపాసమున్నరు బాయిలకాడ ఇంజన్లు పెట్టుకున్నరు – ఇంటిముంగిల తలోటిబుగ్గలు[67] పెట్టిచ్చుకున్నరు.... ఇండ్లల్లకు తీసుకున్నరు.... కోమటోడు పెండ్లాం, పోరగండ్లు ఏరగబోతరని, ఆగుకెల్లి సేన్ల మందిలేనికాడ, ఇండ్లులేనికాడ బుగ్గపెట్టిచ్చిండు! పెద్దమ్మ గుడికాడోటి, గూడెంలోటి పెట్టాల్నని ఎంతమొత్తుకున్నా?.... ఆడెవడో ముక్కెమంతిరచ్చిండంటే కూడుదినకుంట సర్పంచ్‌గాడు తీసుపోతే .... రోడ్లేపిచ్చినన్నడు!.... అయ్యెవ్వనికి కూడు పెట్టినయ్? ఆల్లేరానుపోను మోటార్లల్లతిరిగెటాన్కి బనికత్తన్నయి....ఎక్కన్నో ఆడివిలబిర్జి[65] కట్టించిండట!.... ఏంజేసుకోను బిర్జి? ఇంకేందేందో సేసిండట.... ఎక్కడ కన్పించలే! కరెంటచ్చిందని ఆడు సెప్పితే మతికచ్చి కోటక్కపజలో సేనొక్కన్ని నిలుసుండి అడుగుతె అందరు నవ్వంగ అడునవ్వి ఏయిత్తనన్నడు.... అఖరికత్తె పెద్దమ్మ గుడికాడ ఒక్కకంబమేసి దానికి బుగ్గ బెడితె రొండ్రోజులెలిగి తప్పుమని ఉడాయించింది....

ఈల్లు సేసెడిదంత నాయమంట! నేను సేసింది అన్నాయంఅట! ఔను మరి! బిచ్చాలెగ బెట్టుడు, సాకల్దాన్ని గుంజుడు సీ సీ, అయ్యన్నినాయం!.... నేను సేసింది అన్నాయం!

---

63. ఆసుపత్రి 64. స్తంభాలు 65. పుణ్యానికి 66. చవుడు నేలలపై 68. బల్బులు 69. బ్రిడ్జి,

నేనేంజేసిన? యాడాదిపొడుగూత ఉపాసముప్పిడుండి అని పొలాన్ని కంటికి రెప్పోలె కాపుకా త్తె- దొరగాడు అడ్లగింజలు పొలం గోసినంక ఇత్తనంటె- అంతదాక ఎట్ల బతుకాలె? అడిగడిగి నోరునొచ్చె- పోరగండ్లు ఆకటికి మాడిసచ్చె కాలమచ్చె.

ఆనాడు సిన్నోడు.... నా పానం [69] నా సిన్నకొడుకు మల్లిగాడు జెరమొచ్చి 'అయ్య ఆకలి' అని ఆ సిన్న సేతులతోటి ఈడుసుక పోతన్న కడుపు సూపిత్తె తనపానం సుమ్మర్లు సుట్టుక పోయి- అని పొలంల అదీ ఆరుగాలము కట్టము జేసి పెంచిన పొలంల ఇంత మెద [70] పాలేరు సూడంగ దెచ్చుకొని నలుసుకొని గంజి గాసు కొనుడు దొంగతనమా ?

అమాట కత్తె నాసింత మీని సింతకాయ- ఇంటికాడెవ్వలు లేకుంట సూసి పాలేర్లతోని ఇత్తుకు లేకుంట తెంపుక పోవుటం దొరతనమా ?

ఆడంటె అట్ల నా కడుపు మీన కొట్టిండనుకుంటె-ఈడు ఈమాలి పటేలోడు- ఏందేందో అదిరి [71] అఖరి కత్తె నా దగ్గెర తప్పు దండుగ తీసుకుంటడ ?

నాయం .... నాయం .... నాయం తల్లెం— ఖరాఖండి మాట్లాడై కట్టు బోతనిరి .... మాదిగిలంజకొడుకులంత అళ్ళు తన్నినా పెండ్లాలనిగ్గినా- అళ్ళ దిక్కే పలుకుతురు— సివరకత్తె అగ్గి, నీల్లు బంద్ జేత్తరు .... ఊల్లంత పుండు మీని ఈపులు కాకుంటె పురుగులు ....

సర్పంచ్ కిట్టయ్య ఇల్లు దాటి పోయిండు. కొంరడు ఇచారించుకుంట .... జల్ది గుర్తొచ్చి ఎనక్కు తిరిగిండు.

కిట్టయ్య పెద్దరువాజ ముంగట నిలుసుండి "పటేలా .... ఓ పటేలా ...." గట్టిగా పిలిసిండు.

"ఎవర్రా ఏల్ల - పాల్ల లేకుంట ...." లోపలికెల్లి సర్పంచ్‌ను సాదుకున్న తల్లి బయట కచ్చింది....

---

69. ప్రాణం 70. ధాన్యపు కట్ట 71. అరచి

"నేనవ్వా బాంచెన్ ...." కొంరడు ఇప్పటి ఆలోచనలన్నీ మరిసిపోయి నసిగిండు మల్ల పాత కొంరని తీర్గ.

"ఏందిర ? కుక్కలకొడుక ! ... పటేలుకేం దెచ్చినవ్ ఇంత నాత్రి ?" ముఖం పేలాల పెంకోలె మాడుసుకొని కసిరింది ...

'ఔనే ... గరీబోన్ని ఏంతెత్త ? .... తెచ్చిచ్చి, తెచ్చిచ్చి, సిప్పచేతి కచ్చింది .... నీ మొగడు పచ్చవాతంల పడితె అని మంచముఅద్రె మట్టుకాడేత్తె అని పియ్యి, ఉచ్చ ఎత్తిపోసేటప్పుడు ఏంపట్టుకచ్చిన ?' ....కొంరని మనుసుల పుకుగు తొలుత్తంది.

"సిన్న పని బాంచెన్ ...." పాతకొంరడు.

బూతుమాటలు తిట్టకుంట లోపలికి పోయింది.

కాసంత సేపటికి బుఱ్ఱపంచె మీదేసుకొని జంజరం తీడుకుంట అచ్చిండు కిట్టయ్య ....

'బొర్ర పెరిగింది .... ఊగుతంది .... పెరుగదిమరి ! రూపాయి తీస్కొని నాలుగు మిరపకాయలు, పిరికెడు ఉప్పు, చెవులేసుకునేటంత నూనెపోసి మిగిలిం దంత తిని బొర్ర పెరిగింది ....' కొత్త కొంరడు ఒకదేలొల్లి పెడుతండు.

"ఏందిరా కొంర ?.... అద్దుమనాత్రి ! ...." కనుబొమ్మలు ముడిసి కసిరిండు కిట్టయ్య.

"ఏంలేదు బాంచెన్ .... గ నలుబై రూపాలు ...." కొంరని గుండెలకెల్లి మిగతా మాటలు బయటపడలే.

"రూపాలెక్కడున్నయిరా? అయ్యవ్వదాస[72] పెట్టిర్రా. ఏయేల్లబడితె ఆ ఏల్ల బదలిచ్చెటాన్కి ?" కిట్టయ్య ఎనక్కు తిరిగిండు.

---

72. దాచి

"నీ బాంచెన్ .... గట్లంటెట్ల ? .... మీరియ్యకుంటె ఎవ్వలి త్తరు ? ముంగటికి నీ బాంచెన్ .... కాటికి కావలుండైన, నీ కాళ్ళకాడ బతికైన ఆడ్డీ[73] తో నీ రూపాలు పూలల్లబెట్టి ఇత్త బాంచెను" నాలుగుసార్లు గడుపకు మొక్కిండు.

"ఏంజూసయ్యలె ? .... అదె ఆవో, లేగో అమ్మరాదు ?....అంతలావయితె..." కిట్టయ్యకు కొంరని బుల్లావుమీన కన్నుపడ్డది .... ఓట్లప్పుడు అనవుసరంగ దానికోసం కచ్చెడు గడ్డి ఇయ్యాలిసచ్చింది.

కొంరని గుండెల్ల బల్లెం గుచ్చినట్టయింది.... మాట గుడుక పెకల్లే "అయి తారము తెచ్చియి" పోశాలు హెచ్చరిక. మూడుగిద్దెల అడ్లు లింగలిద్దరికి కొలువాలె.... మల్లిఊకుంటదా ? తనమామ మల్లితోడుత అర్న[74] మిత్తె అమ్మంగ, అమ్మంగ మిగిలిన ఆవు. ఆకలయి ఏడిసే పోరగండ్లకు గుక్కెడు పాలిచ్చే ఆవు.... కొంరని మనసు సుమ్మర్లు సుట్టుకపోతంది....

కిట్టయ్య లోపలకు పోతండు.... కొంరనికేం సేయల్నో తెలువలె ... మీన సందిల దీపం ఎలుగుతంది.... తనసేతుల మీన పెరిగిన కోల్లాగెల, తవ్వెడు' తవ్వెడు పాలిచ్చె గొడ్లను ఊనికె ఇచ్చిన. అయిన ఊనికి కడుపునిండలే– ఉన్నొక్కకోంద్ర గుడుక ఊని కొమ్ముమన్నే పెట్టిన....

కోంద్రంటె మతికచ్చింది... చెవులఉన్న సగంకాలిన సుట్టమొక్క తీసు కున్నడు. జెకమొక కొట్టుకొని సుట్ట అంటించుకొని గుప్పు గుప్పున రెండు దమ్ములిగ్గిండు.... ఆడు ఇంటి ఇసియం, గొడ్డు ఇసియం మరిసిపోయిండు.

"బాను, గుడిమెట్టు బాడువపొంట.... లైను గొట్టినకాడ సెలుకుండె.... గడ్డలంపులు సమానం సేత్తె --- అది పరంపోగే[75] నాయె, నీ యక్క..! ఆ యింత కొమ్మగొట్ట గొట్టుకుని కట్టబడితె.... ఇంత బాయిపొక్కతోడ్కుంటె.... అరేడెకరాలు పెరడైతది. నీ యవ్వ! దీని తల్దెం....! ఈ దొరోల్ల జీలి గీలి ఏముందదు".

సందుల దీపం రెండుమాట్లు కొట్టుకొని తప్పుమన్నది.

---

73. పడ్డీ. 74. కట్నం. 75. పోరంబోకు.

కిట్టయ్య తిని బయటికెల్లి, కంబము మొదట్ల అగ్గిని సూసి —

"ఎవ్రరా? ..." గద్దరాయించిండు.

"బాంచెన్–కొంరన్ని..." లేసి కిట్టయ్యముంగటి కచ్చిండు–సుట్ట మలిపి చెవుసందుల పెట్టుకొని.

"ఇంకీడ ఏంజేత్తన్నవ్‌రా ?" కిట్టయ్య.

"ఇసారించుకుంటున్న – బాంచెన్, గొడ్డును లేగనెంతకు దీసుకుంటరు ? బాంచెన్...." కొంరడు.

"ఏమియ్యల్రా ? గొడ్డు మూడీతలది. ఏంబెట్టినా లేగకే ...."

'కోమటోని బేరం ఉప్పో, పప్పో ఇత్తడు కావచ్చు' మనుసుల కొంరడు. పైకి - "గొడ్డు ముసల్దా ? బాంచెన్ - మీరు సూత్తినే సూత్తిరి, మూడరుసోల్ల పాలిత్తది. మీదగ్గరనైతే తవ్వెస్నరు సోడిత్తది. అడుగరాదుర్రి బాంచెన్ ...."

"మూడుగిద్దెల అడ్లు - నలభై రూపాలు గిత్తయాను[76] ర?.... నువ్వె సెప్పు .... ?" కిట్టయ్య ....

కొంరనికి శలీరం మండింది....ఏంజేత్తడు ? "గాయింతేస? బాంచెన్ .... అరేడు నూర్లు పెత్తరు కోల్లాగెకె ఇంక రెండేండ్లకు."

మరో ముప్పయిత్త నీ యిట్టము .... కిట్టయ్య ఎనుకకు తిరిగిండు లోపలకు పోయెటాన్కి.

'మల్లి .... పోరగండ్లు .... నలుబై రూపాలు - మూడుగిద్దెల అడ్లు .... తన పానం అవు' .... తోడుదొంగలు ఇంతకన్న ఎవ్వడెక్కువియ్యడు.

"సరె బాంచెన్ .... పొద్దుగాలొత్త .... "కొంరడు.

---

76. గిట్టుబాటు అవుతయా ? 77. ఖచ్చితమేనా ?

మాట పక్కేన ? .... కిట్టయ్య హెచ్చరించి లోపలకు నడిసిండు.

కొంరడు గూడెంకెల్లి నడిసిండు

సీ, సీ .... ఎక్కువోల్లంత లంగలు! నాయంలేదు! లమిడికొడుకులు, నేనేమొ రెక్కలు, బొక్కలు, కళకళమనంగ కట్టబడాలె! ఆళ్ళేమొ మనమీన సవారు సేయాలే! యాడున్నది నాయం?

ఏందోగని ఈదేవునికి గుడుక నాయం తెలువసట్టున్నదెహెఁ! కాకపోతె - మందిని ముంచెటోల్లకె - మేలుసేత్తడు. ఈడుగుడుక లంచాలోడే ఉన్నట్టున్నది!

అన్నట్టు సర్పంచ్ గానితోటి మంథెన్లకు పోతె ఆడెవ్వడో ఆనాడునాత్రి సబ సెప్పి దేవుడు లేడన్నడు. అని మాట నిచ్చమే [78] సనిపిత్తంది. ఆనికేమెరుక ? సోరోడనుకున్న-నిచ్చంగ దేవుడుంటే ఎందుకు సూత్తలేడెహెఁ? గింత అన్నాయం జరుగంగ ఆడు కల్లు మండుపకాడ కడుపుబ్బ తాగినోన్కి పపంచము బట్టనట్టెందు కూకుంటడు. నల్లగొండ సొత్తుర్లు కిట్టావతారం సెప్పినప్పుడు ఎప్పుడు పడితె అప్పుడు అచ్చి పాండవుల ఆదుకున్నడె.... మాల్లె కిట్టడు పాండవులకత సెప్పిండు దర్మరాజుకు గిట్లనే కట్టాలు తప్పలే- కిట్టమూరితి అచ్చిండు. మరి ఈడేడి ?....

పోశమ్మకు గొలిసేటప్పుడు ఘటమెత్తుకొని 'బలో బల' ని లెల్లాయిపాట పాడుకుంట పోతంటె పంబాల దుర్గన్న "శగితి ఆగ బట్టిందిరా" అని కేక పెట్టి కోడి పిల్ల లెగిరేయాలె అన్నడు ఉత్త దెందుకయిద్ది? దెహెఁ! అని తపాసె మల్లె మొఖానికి మంత్రాలత్తయ- అని ఎద్దు కడుపుబ్బి పెటేల్న సచ్చింది. ఏలుపమ్మ పట్టిందని ఆడే అన్నడు. జువ్వి కిందకోత్తె కారుమబ్బు లేసి సచ్చిందని తెలిసింది.

అంత అట్టిదె! దేవుడు లేడు-దయ్యం లేదు. బయపెట్ట టాన్కెగని....

పల్లె దాటిండు.... పిల్లగాలి మురుగు వాసన మోసుక పోతంది. కొంరనికి సీకట్ల మాదిగోల్ల గుడిసలు దయ్యాల పవుతుగ అగుపించినయ్. పల్లెకెల్లి సూసిండు సందు దీపాలు ఎలుగుతున్నయి. మాదిగి గుడిసెల సూత్తె రోతపుట్టింది. కొంరనికి-

78. నిజమే

మాదిగిగూడెం అవుతల నక్కలు కూ త్తిన్నయి. జువ్వి సెట్టుకింద కుక్క ఒక్కతే కూకొని ఏడుత్తంది.

ఆరుగాలము కట్టబడ్డ మాదిగగూడెం పల్లె వవతుగ కాక పోవటాన్కి కారణంయేందో కొంరనికి తెలువలె.... అదే పల్లెల కొంతమంది పెద్దోల్లయి ఇంకొంతమంది కూటికి లేనోల్లయిందెందుకో ? అడు గుర్తుసేసుకోలె.... పెంట కుప్పలు, ఇరుకుసందుల గుండనడిసి గవులుగొడ్తన్న గూడెంల నుంచి ఇల్లు సేరుకున్నడు.

పందిరి కిందనుంచి గుడిసెలోపలకు పోతంటె ఆరేసిన మాంసపు నారలు నెత్తికి తగిలినయ్.... సీ! సీ!

గుడిసెలోపట దీపం సమురులేక మలిగిపోవటాన్కి తయారయింది. తొడమీన సంటిదాన్ని పండబెట్టుకొని ఏడుసుకుంట గలుమకెల్లి సూత్తంది మల్లి ....

అంగకుంటనె గుడిసెలకు సొచ్చిండు. "నాసలుకు ఆసం[79] తగిలింది. "అన్నన్నాయి..." తడుముకుంట లోపలికి నడిసిండు.

"అచ్చినావ్రా ? నీ కాడుగాల, పోరగండ్లనోట్లె మన్నుకొట్టి...'' మల్లి ఏందేందో తిడుతంది.

''నేనేం జెయ్యాల్నె?'' కొరండు సేతగానితనాన్ని ఎల్లబెట్టిండు, కూలబడుకుంట.

"ఆలిండ్లుకాల, కూల, కాముని పెంటగాను, నాపోరగాండ్ల కాడి నోటి బుక్క దీసుకున్నోని నోటికాడి బుక్కదేవుడు దీసుకుంటడు. ఆని సేతులకు నరుప్పులు బుట్ట, జెట్టలుబుట్ట, బోడగుండు సౌదరోని మొల్తాడు దెంప- ఆని పిట్టకు బెట్ట- అప్పటికప్పుడు జీతమెగబెట్టిండు, ఇప్పటికిప్పుడు దండుగ బెట్టిచ్చిండు. మాలిపదే లోని ఉన్నాక బిడ్డ ముండమోత్తది- నీకేం పాపం జేసినంరో దేవుడ !.... నీ గుళ్లె రాయి బడన్రోదేవుడా !" ఎటుసాతగాక ఏడుపు మొదలుపెట్టింది.

---

79. వాసం

"అయ్యా !.... అయ్యా ! నువ్వు రాంగ జొండ్లు దెత్తినన్నవ- గడుకెప్పు డిసురుతం ?.... బువ్వ.... ఓ అవ్వ ! బువ్వే.... హాఁహాయ్యి.... మర్రెహాహో.... సుక్క దాన్ని గొయ్యి! ఆకలై సాతనై తలేదంటె ఉరుకుతంది...." రాజిగాడు నిదురల కలువరిత్తండు....

కొంరని మనుసు ఎట్లనే వున్నది. అనికి గుడుక ఆకలైతంది. ఆకలికి సిన్న పెద్ద బేదం లేదు గద ?.... ఇగ పోరగాండ్లదో లెఖ్ఖా !...

రాజిగాని పక్కకు ఒరిగిండు కొంరడు....

కడుపుల కరకర లాడ్తన్న ఆకలి ! కాళ్లు కడుపుదాక ముడుసుకున్నడు. అయిన అకలి తగ్గలే—

గుడిసె బయట లేగ ఒర్రింది. అవు దాన్ని పిలిసింది.

"లేగ నువ్వు పసురానివైన నీఅదురుట్టం బాగున్నది.... ఏం బతుకులో ముది నట్టపు బతుకులు !.... సచ్చింది మేలు.... మనుసులము —" సగంల ఆపిండు కొంరడు.

మల్లి ఏడుపు మగ్గి ఎక్కిల్లకు దిగింది.... బయట లేగపోలు చీకుతంది...

జువ్వికింద అకలై కుక్క ఏడుత్తంది.

3

తెల్లారి పోయింది..... పల్లె తెల్లారకమునుపె లేసి బతుకు తెరువు కోసరము పారలు, గొడ్డల్లు, కొడువల్లుఁ నాగండ్లు పట్టుకొని పొలాలల్లకు సేన్లల్లకు ఎటుబోయె టోల్లటు పోయిర్రు.... తూరుపు కెల్లినుంచి సూరీడు కత్తులు, కటారులు, బాణాలు ఇసురుతున్నడు.

బొత్త కొంరడు ఎటో పోయచ్చి తలకున్న గుడ్డను దులిపి మొఖం తుడుసుకున్నడు.

మల్లి గుడిసె బయటకచ్చి దుబ్బకొట్టుక పోయిన ఎంటికలల్ల రెండు సేతు లుంచి కాసేపు గోక్కున్నది. అటెనక సిక్కులు దీసి ముడిపెట్టటాన్కి పయత్నం సేసింది. కాని ఆల్ల బతుకుల తీరుగనె ఎంటికలు అనుగలే.

"అయ్యా ! గొడ్డు నిడువే కొట్టుకపోత...." రాజిగాడు కొంరని ఎనుక లేగ తలుగు సేతుల్ల పట్టుకొని సిన్నకట్టె సంకల పెట్టుకొని నిలబడ్డడు.

"ఇంక గొడ్డెక్కడ్డిర? గొడ్డుకు మనకు బాకి సెల్లిపోయింది!" గొడ్డుకెల్లిసూత్తె వాని గుండె తరుక్కపోతంది.

రాజిగాని కామాట సమజ్‌గాలె....

ఇంతట్లకె కిట్టయ్య పాలేరు మల్లేశ దచ్చిండు.

"కిట్టయ్య పటేలు గొడ్డును తెమ్మన్నడు." మల్లేశడు.

"ఏందేంది?...." మల్లి ఎంటికలల్ల సేతులుంచి ఆవుదగ్గరి కచ్చింది అదిరిపోయి.

"మన గొడ్డు నమ్మిన్నే...." కొంరని గొంతు తట్టుకున్నది.

"నీ సేతులు పడిపోను గదరో ! మా అయ్య సంపతి ఈ ఒక్క గొడ్డును గుడుక అమ్మినావురో ? నీ దినాల కరుసు[80] కనుకున్నావురో ? నా పోరగండ్ల గతేంగానురో దేవుడాఁ !" సిన్నగ రాగం తీసింది.

కొంరడు గొడ్డుకాడికెల్లి దాని మూతిమీన సెయ్యేసిండు ఎన్నడులేంది గొడు మట్టుకాన్నె పెనుగులాడింది, బెదిరి బెదిరి సూసుకుంట.... దానికికూడ ఎరుకైందేమొ ?

"నాగొడ్డు...." రాజిగాడు లేగ తలుగిడిసిపెట్టి గొడ్డు దగ్గరి కురికిండు.

కొంరడు గొడ్డును నుచ్చుకొట్టి దాని మెడకు తలుగు తగిలించి దాని తలకాయమీన మొఖంపెటి కన్నీలు కారిసిండు.... "నీకు నాకు రుడం[81]" తీరిందె.... గొంతికనిండ ఏడుపు నిండుకపొయ్యి మాట పెకుల్లే ....

80. అంత్యక్రియల ఖర్చు 81. రుణం.

మల్లేశడు తలుగు కొసకు పట్టుకున్నడు. గొడ్డు సిర్రు బుర్రు లాడింది. మల్లి బూతులు తిట్టుకుంట బొటబొట ఏడుసుకుంట గొడ్డును పెయ్యంత ముట్టు కొన్నది....

రాజిగాడు ఏడుసుకుంట దాని కాల్లముంగటిక్కి పొయ్యి "నీ కాలు మొకుత మల్లేశన్న .... నన్ను తొక్కిచ్చుకుంట - నా మీనికెల్లి లీస్కపో.... నా ఆవులేగ పోయినంక నేను బతికెందుకు...." అడ్డం పండుకున్నడు.

"గిసొంటోల్లు ఎందు కమ్మిర్రు ?" మల్లేశడు గునిసిండు.

మల్లి రాజిగాన్ని జబ్బ పట్కొని గుడిసెల కీడ్సుకపోయింది ఏడుసుకుంట....

కొంరడు మారుమాట్లాడకుంట అక్కెల్లి నడిసిండు. జువ్వి సెట్టుకింద కుక్కలు మురిగిపోయిన గొడ్డును పీక్కతింటన్నయి. మీన పీతిరిగద్దలు, బొల్లి గద్దలు తిర్గుతన్నయి.... మల్లి సాపిచ్చుకుంట ఏడ్సుడు ఆనికి కాసంత, కాసంత దూరమైతంది....

ఎనక్కు దిర్గి సూసిండు.

మల్లేశడు దడిపొరుక పీకి గొడ్డు ఈపుమీన జాడిచ్చి కొట్టిండు.... ఇన్నేండ్లుగ కొంరడు కొట్టని గొడ్డు- గావురంగా దిరిగిన గొడ్డు- నడ్డిరిసి ముంగటికి సాగింది. దానెనుక లేగ ఒర్లుకుంట ఉరుకుతంది....

కొంరని కండ్లల్లనుంచి- ఇముడలేని నీల్లు రెండు సుక్కలు నేలమీన పడి ఇనికిపోయినయ్....

(ముగింపు - వచ్చే సంచికలో)

రచయితలకు మనవి

ప్రజా జీవితాన్ని, పోరాట చైతన్యాన్ని ప్రతిబింబించే కథలు కావాలి. సృజనాత్మకమైన, కళాత్మకమైన కథలు పంపించి 'సృజన'తో సహకరించాల్సిందిగా కథకులను కోరుతున్నాం.

— సంపాదకుడు.

అ. ర. సం. అభ్యుదయం

ఒకవైపు తెలంగాణా పోరాటం భూస్వామ్యవ్యతిరేక సాయుధ పోరాటంగా పరిణమించసాగిన గొప్ప చారిత్రకదశలోనే, అరసం పత్రిక (అభ్యుదయ) తన సంచికల్లో ఒకదానికి విశ్వనాథ సత్యనారాయణగారి చిత్రాన్ని ముఖచిత్రంగా వేసుకుంది. 'పాము చుట్టం – పడగ పగ' అన్న సామెతగా విశ్వనాథ సత్యనారాయణగారి భూస్వామిక (అదికూడా కాదు, ఆదిమ) భావజాలాన్ని విమర్శిస్తామంటూనే, విశ్వనాథ సత్యనారాయణగారిని మాత్రం ఆరాధించడానికి (ప్రయాగ కోదండ రామశాస్త్రి, విద్వాన్) వంటి 'అభ్యుదయ' రచయితల సంఘ ప్రముఖులు నడుము కట్టారు. అంటే అలనాడే అరసం ప్రణాళికకూ, ఆచరణకూ పొత్తులేకుండా పోయిందన్నమాట !

మరి, రివిజనిజం బూజు కమ్యూనిస్టు ఉద్యమంనిండా పట్టి దాన్ని ఒక భూతగృహంగా మార్చివేశాక, అరసం కూడా దానికి అనుగుణంగానే తన కార్యాచరణను మలుచుకుంది. మాస్కో శంఖులో పోసిందే తీర్థమన్నచందంగా, విశ్వనాథ సత్యనారాయణను సాహిత్య ఘనత గురించి పెత్రూనిచేవా అనే "పండితురాలు" మెచ్చుకోవడం జరిగింది కాబట్టి, విశ్వనాథ సత్యనారాయణను తమ సంఘానికి పూజనీయ వ్యక్తులలో ఒకనిగా అరసం చేసుకోవచ్చు.

దేశంలో భూస్వామికమే అంతరించిపోయిందని భావించే కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన నడిచే సాహిత్య సంఘాలు కాబట్టి, అరసం ఇక తన దాడులను ఏ అభివృద్ధి నిరోధక భావజాలంమీదికి మళ్ళిస్తుందో వేచి చూడాలి. ఆర్. యస్. యస్., జనసంఘం, విద్యార్థి పరిషత్‌వంటి మతసంస్థలు ఫాసిస్టు సంస్థలని అంటూ ఉన్నదంటే భూస్వామిక భావజాలం ఇంకా ప్రమాదకరంగానే ఉందని తాను భావిస్తున్నట్టే, మరి ఈ భావజాలం నుండి విశ్వనాథ సత్యనారాయణగారి సాహిత్యాన్ని వేరుచేసి చూడగలరా ?

విశ్వనాథ సత్యనారాయణగారి నోట్లోంచి ఊడిపడ్డవారు కొందరు ఇప్పుడు అ. ర. సం.లో (అది మరో అ. ర. సం. లెండి) సభ్యులుగా వుంటున్నారు. 'ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం' అంటూ కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ ఇందిరా నాయకత్వాన నడిచే సర్కారీ అభ్యుదయ రచయితల సంఘం మంత్రుల ఆశీస్సులతో, సాహిత్య పూర్వ సుమంగళం ఆధ్వర్యాన, గాంధీ జ్ఞానమందిర్‌లో రాజధానిలో ఫిబ్రవరి (1976) 14, 15 తేదీలలో మహాసభలు జరుపుకుంది. దీనికి ప్రారంభకులెవరనుకున్నారు "అభ్యుదయ కవి చక్రవర్తి" అనే బిరుదొకటి తనకుతానై మెడలో వేసుకున్న డాక్టర్ దాశరథి! నిజాము నవాబు నెదిరించి గొంతెత్తిన ఈ కవి పరమ నికృష్టమైన జాతీయ దురహంకారవాదిగా పరిణమించేందుకు, జాతీయవాదం తోడ్పడింది. ఇరవై అంశాల ప్రణాళికను శ్రీసూక్తంగా, ఇందిరాగాంధీని సాక్షాత్తు అపరశ్రీదేవిగా భావిస్తున్న ఈ అహంభావ కవి 'అభ్యుదయ' రచయితలకు రెండువైపుల నుంచి ప్రమాదం ఉందని 'అభి' భాషించాడు. అవేమిటి ? ఒకటి కుడివైపునుంచి వచ్చేది. రెండోది ఎడమవైపు నుంచి వచ్చేది. కుడివైపునుంచి వచ్చే ప్రమాదమేమిటో నోరు విప్పి చెప్పలేదు కాని ఎడమవైపునుంచి వచ్చేది మాత్రం 'విప్లవ రచయితల సంఘం' అనే 'అడ్వెంచరిస్టు' లట! డాక్టర్ దాశరథి గారికి ఎంత పక్ష(వా)పాతం! 'కుడి' —ప్రమాదానికి ఒక బొమ్మ కట్టలేక పోయారంటే, కారణం అనూహ్యమేమీ కాదు తామూ, అందులో ఒక భాగమే. తమది ఎడమగా కనిపించే 'కుడి'. చివరకు అ.ర సం కూడా సాపేక్షికంగా 'కుడి' శక్తులలో చేరికే. మాటల్లో సోషలిజం, పనుల్లో రివిజనిజం ఆ పార్టీకి దాని సాహిత్య సంస్థ అ ర సం కు లక్షణం కాగా ఇందిరాగాంధీ సోషలిజం (జాతీయ సోషలిజం) మాటెందుకు ? దానికి కైంకర్యం చేసే "డాక్టర్" దాశరధి మాట అసలెందుకు ? తాను విశ్వనాధకు ఆధునిక వారసుడే !

—సుమిత్ర

★★

"స్వేచ్ఛలో విశ్వాసం వున్నందుకే నేను కమ్యూనిస్టు నయ్యాను."

— కాడ్వెల్

సమీక్షలు :

"కటకటాల నుంచి సుదూర స్వేచ్ఛాకాశంలోకి"

"నిద్ర పట్టని నిరంతర దీర్ఘ రాత్రులలో
కటకటాల వెనుక జీవితం గురించి
శతాధిక గీతాలు రాస్తాను
ఒక్కొక్క గీతం ముగిసినప్పుడల్లా కలం క్రింద పెట్టి

కటకటాల నుంచి సుదూర సేచ్ఛాకాశాన్ని తొంగి చూస్తాను—" అన్న - జాతికి మేలుకొల్పులు పాడేవాని (హోచిమిన్) పాటలను కె. వి. రమణారెడ్డి 'జైలు కోకిల' మనకు గుర్తుకు తెచ్చి, "ఉదయాన్ని ముట్టించవచ్చు" నన్న భరోసాను కలిగిస్తుంది.

"గాలిని బంధించాలని పెరిగిన గోడల మధ్య" (వరవరరావు) ఎమర్జన్సీ కాలంలో - కె. వి. ఆర్. జీవితానుభూతులకు కావ్యరూపం 'జైలు కోకిల'. ఆయన ఆ కాలంలో మూడు జైళ్ళ జీవితం చూసారు.

"పద్దెనిమిది జైళ్ళ రుచులు చూసాను.
ఇంతకూ నేను చేసిన నేరం —
ప్రజలకు అంకితం కావడం" (హోచిమిన్)

ప్రజా పోరాటం నుంచే జైళ్ళకు వెళ్ళాడు కె. వి. ఆర్; ఆయన 'జైలు కోకిల' - "దోపిడీ వ్యవస్థ చేయించిన నేరాలను/అమాయకంగా మోస్తున్న ఖయిదీ" (వరవర రావు); "పుండుబడిన పేగులతో/కీచుబడిన గొంతుకతో కడుపాకలి కాకలితో/కొసరి ఏడ్చే" పేద కోకిల; "పగరు మేసి తీపి నిచ్చు పిచ్చి కోకిల"; గెలుపు బాటలో పాటలుపాడే ప్రజా కోకిల; క్రాంతి కోకిల.

"జైలులో వున్నందువల్ల .... కొత్త పుస్తకాలు జనం నెత్తిన రుద్దటానికి వీలు కుదరచ్చు" ననే 'కుక్కగాని తోక'లకు హోచిమిన్ మాటలు అర్థంకావు :

"బందీగా కవితాబంధం చేస్తాను
పాడుతూనే స్వేచ్ఛా దినం చేకొనివస్తాను."
ఈ 'కుక్కగాని తోక'ను ఇట్లా వర్ణిస్తాడు కె. వి. ఆర్;
"కుక్కను త్రైతక్కలాడించేది తానే
ననుకుంటూంది దాని వంకరతోక"
"ప్రభుపుకంటె వాని వశంకర కింకరుడే
అధికతర రాజభక్తి కక్కివేస్తున్నాడు"

ఈ 'భూతవైద్యగాళ్ళ' మాటలను కె. వి. ఆ మనకు ఇలా చెప్తున్నాడు. (పాణిగ్రాహి పాటకు రాసిన పేరడీలో) :

"రివిజనిస్టులం మేము రష్యా కిష్టులం
ఔనన్నా కాదన్నా ఇందిరిష్టులం"
"మార్క్సిజ మది ఏమైనా, మూర్ఖిజాన్ని విడనాడం"
"శాంతిని సహజీవనాన్ని వర్గాలకు నేర్పుతాము
బోనస్సులకన్నా ఉత్పాదనమే ఘనమంటాం"
"ఉన్నవాడి చంకనెక్కి లేనివాడి కొరిగిస్తాం"
"చెదపురుగులమై ఈ రాజ్యాంగం భక్షిస్తాం
చేరి కొలిచి చివరికి రాజ్యేందిరనే వరియిస్తాం."

"జనం పోతే పోనీ! మన భోజనం జరిగితే చాలదా యని," శ్రామిక విప్లవ పథం విడిచిపోయేముందు వీళ్ళు పాడుకున్న 'పలాయన గానం' వినండి :

"సాహసం మన వల్లకాదు! సహనమా ? అది వల్లకాదు"
"ఆవుతోకకు వెంట్రుకవుదాం, ఆవు గోమాయువే అయితేం ?
"సాధు విప్లవమే పసందని వెళ్ళిపోదాం ?
వాట మెరిగిన వేటగాళ్ళం. విప్లవోద్యమ వేషగాళ్ళం,
కేటుగాళ్ళం, గాలికోళ్ళం, వెళ్ళిపోదాం ?"

"కలలెల్ల పండి కో/కిల పిల్చె చెట్లపై" అని భీమన్నల ఎమర్జన్సీ

"కొక్కురో, కో" కవిత్వాల్లో "వామపక్ష భావాల రచయితల కార్యక్రమాలు" చూసే అమ్ముడుపోయిన రచయితలకు —

"అమ్మా ! త్వమేవ శరణమ్ మమ" అంటూ "మంత్రాలకు రాలే చింతకాయల కోసం కాచుకున్న మనుషులకు— 'కన్నీళ్ళ సిరాతో ఈటెలుగా మలిచిన' (హో) కవిత్వం— 'జనం నెత్తిన రుద్దే' కవిత్వం లాగే కనిపిస్తుంది. 'పవన మెప్పుడూ, పక్షికి ప్రతికూలమే కదా !' (హో)

అందుకే—

నీటి వాలున గరికపోచైన పడిపోద్ది
మేటి మగటిమి ఒకటె ఏటి కెదురీదుద్ది —

అని— 'ఏటి కెదురీదిన వాడే మనిషి' లో— పీనుగవో ప్రాణివో చేసుకో నిర్ణయం అంటున్నాడు కె.వి.ఆర్.

'ఇందిరాక్షసి రాజ్యంలో' కె.వి.ఆర్. 'సవాళ్ళను వీధుల్లో నుంచి ఖైదు లకు మార్చింది. రాజ్యాహంకారం' అంటున్నాడు. 'మోసాలు వేషాలు / మీస చటం పాలు' అని బంగారు పంజరంలోంచి సినారె సినిమా కోకిల కూస్తే—

మీసాలు వడ దిప్పినా సరే
మీసా చట్టాలు గుప్పినా సరే
ఈ శిథిలీభూత వ్యవస్థా భూతానికిక అఖరే —

అని జైలు కోకిల భవిష్యత్తును శాసిస్తున్నది.

"గోరీలకు తప్ప మరి దీనికి లేదిక్కడ బెత్తెడైనా స్థలం" అని "కాపాలికా రాజ్యా"న్ని చూపుతున్నది జైలు కోకిల : "కాటి కాపరి ఒక్కరే ఇక్కడ సమస్త జనతా ప్రతినిధి". "ప్రజావళిని హతమార్చే/భయంకర విషవాయువును/బంధించే ఆదిశక్తి" అని ఆస్థాన కవికోకిల ఇందిరను కీర్తిస్తే— "అదుపు తప్పిన పాలనై, అధికార విజృంభణై– / గోల పెడుతున్న గాలి" – రాణి గురించి ప్రజాకోకిల యిట్లా పాడింది :

"పీయూష వర్షిణిగా భ్రమ గొలిపే పాషాణి
పావురం స్వరాన్ని అనుకరించే గృధం
యోగినిగా వ్యవహరించే వామాచారిణి"

"వరదాయినిగా కనిపించే శాపరూపిణి
వశవర్తుల స్వేచ్ఛలను పణం ఒడ్డి
స్వాధికార ద్యూతమాడే ఇంద్రాణి."

అంతేకాదు; "నేటిశ్మశానం మీదికి దండెత్తి వస్తాడు ప్రాణి" అని చెప్పి, "వచ్చి, ధ్వంసించక" ఏం చేయాలి యింకా అని అడుగుతున్నది క్రాంతికోకిల. మరి, ఆస్థాన కవిని 'ఆయుధ పూజ' తో సత్కరించడమూ మానలేదు :

"రాణి అరికాలి పారాణి వయ్యావు
అధికారి మెడ జరీ కండువా నీవు
కైంకర్యమే నీకు కైవల్య ధాత్రి
కైవారమే నీకు నిత్య గాయత్రి !"
"దీనుడి ఒంటిలో గుచ్చి నీ కులుకి
దోపిడీ గడీగోడపై నెత్తు రొలికి
వర్ణచిత్రం రచించే చిత్రలేఖా !
వర్గభేద మబద్ధమనే వక్రరేఖా !"
"దెష్టే జనజగద్దేవి అంటావా ?
హజమా ప్రజాస్వామ్య రాజ్యమంటావా ?"
"అక్రమానికి కూలికైత చెబుతావా ?"

'రాజా—రాణి' లో— ఇందిర—

"ఆస్తికి ఆశీర్వాదం ఆకలిపై యుద్ధం
తనకు చిక్కులెదురైతే జనం చంక కెక్కు
అక్కర తీరంగానే ప్రజ తలనే తొక్కు "

"భామనే సత్యాభామనే" బాణీలో 'రుద్రాక్ష పిల్లి' యిట్లా పాడుతున్నది— వీక్షుల విందుగా :

ఉన్నదున్నట్లుండవలెను లేని దున్నట్లుండవలెను
ఎలుకలను కడుపులో దాచుక పిల్లి దున్నట్లుండవలె ననవే !"

"దేశవాళీ సామ్యవాదం ద్వేషరహితం ప్రేమ మహితం అరువు సొమ్ములు బరువు చేటను పరమసత్యం ప్రబోధిద్దామే !"

"మేము చేసేదేను చట్టం మేము చేసేదేను న్యాయం మాది రాజ్యం మాకె భోజ్యం పదవి విడవం విడవమంటామే!"

"జెలగలకు గురువులు గదా మొసళ్ళు" అని– "మొసళ్ళను పెంచి పోషించాలి" అన్న "మ. ఘ. వ. వెంగళాయత్వం" నిర్ణయం విని– అంటున్నది జైలుకోకిల. 'మొసలి', జైల్లో హోచిమిన్‌కుకూడా కనిపించింది :–

"మొసలి మీదెక్కి స్వర్గంలోకి
సవారి చేస్తున్నట్టు ఓ కల—
మేలుకొని చూడగా, అర్థంతరంగా జైలులోకి
దూర్చివున్న నా తల."

"నీ కిరణాంకుశి అందించి అక్షత నక్షత్రలోకాలవెంట తిప్పించవూ?" అని చంద్రమను చూస్తూ 'సుహృద్గీతి' పాడిన జైలుకోకిల కొడాలి ('జైలులో చందమామ')ని గుర్తు చేస్తున్నది :–

"నవ్యతారా పథమ్ముల నడచు నిన్ను
నే కిరీటాధిపతులు బంధింపగలరు?
కష్టతర దీర్ఘ యామినుల్ గడచి వేగ
బంధన విముక్తులను జేయవలయు మమ్ము"

ఖైదునుండి బయటపడి—

"ఆడబోవాలి పోరాడబోవాలి
పోరాడు ధీరులను చేరబోవాలి"
"స్వేదాన్ని రక్తాన్ని పాడబోవాలి
సాగే చరిత్ర నది నీదబోవాలి
పడి లేచి గమ్యాన్ని చేరబోవాలి"—

అనుకుంటున్నది జైలుకోకిల. "జైలవతలే ఉంది జీవితం బయలు" (హోచిమిన్)

అయితే– జైలు బయట ఉండికూడా "తిట్టబడి కొట్టబడి / హింస కర్పించబడ్డ" 'ప్రియమిత్రు'లను చూసి "మాకు జైలూ ఇల్లు / మీకు ఇల్లూ జైలు" అంటున్నది.

కావలికి సమీపంలో కొందరు 'నగ్జలైట్ల'ను తెచ్చి కాల్చి 'ఎదురు కాల్పు'ల్లో మరణించారని ప్రకటించిన వార్త విని—

"బాంబులు గుప్పిళ్ళ మీవి ఓ నాయన్లారా
బందూకులు మీ బాహువులో నాయన్లారా"—

అని గానం చేసింది ఖైదీ కోకిల ('కత్తిదోటీ').

"1-12-75" కవితలో—

"కనిపించని లోకానికి కనుల నిచ్చినారు
కదలని కనుగోళానికి కాంతి తెచ్చినారు"—

అని "త్యాగతరంగాలు, దీక్షా వజ్రాలు" అయిన భూమయ్య, కిష్టాగౌడ్‌లకు జైలు నుంచే విప్లవ జోహార్లు అర్పించింది ప్రజాకోకిల.

"తరళించే తూర్పు దిక్కు తేసగు మావో హృదయం
బురుజుల జీల్చే గాడుపు చురుకుదనం దీని గుణం"
"పంటపొలాలే చేతులు పనిసాలలు కాళ్ళు
పోరాటం తన శ్వాస ప్రజాకోటి బాస"—

అని- "ఆకలి ప్రాణాగ్ని కాంతి, ఆగని జన విప్లవగీతి"ని— "సామాన్యుల కామనలే తన సాధనలై"న 'ఉక్కు పువ్వు'తో పోల్చి—

"ఈవేళ ఇనుము, ఉక్కు కూడా
మనం కవితలలో చేర్చాలి
కవి తానూ ప్రతిఘటించడం నేర్చాలి"—

అన్న హోచిమిన్ బాటలో పాడింది ప్రజాకోకిల.

"SOWETO" లో—

"ఎగురుతున్నై ఎగురుతున్నై
నల్లగుండెల ఎర్రమంటల
నిప్పు రవ్వలు—
బడుల్లోనూ బజారుల్లో తుపాకీలకు జవాబులుగా
నిప్పురవ్వలు."

"ఉక్కు చట్రం చట్టంలో దూరి పీఠాసనం" వేసిన, "విధేయతను భద్రతకు పర్యాయవాచకం" చేసిన "శవప్రాయులచేత యథాస్థితికి బ్రహ్మరథం" పట్టించిన "కావ్యాలనల్లా సంకీర్తనలుగా" మార్పించిన - 'భయం'తో - ఎదురుపడి జైలుకోకిల "నీతోనే నీతోనే / మా యుద్ధం" అని సవాలు చేస్తున్నది.

"వి.ర.సం. ఇంకా బ్రతికుందా?" అని సందేహం కలిగినవాళ్ళ నుద్దేశించి "అరగదు కరగదు అ.ర.సం. లాగా", "అకాడమీ మోహినికి వశపడదు/ మంత్రి

వృషభునకు మంచం వెయ్యేదు'' అని - ‟శిక్షల్లో పుటాలు పడే సువర్ణలోహం'' ‟అక్షయదేహం'' గా కలిగిన జైలుకోకిల - చెప్తున్నది :- వి.ర.సం. ఖైదొక బడిగా భావిస్తుంది, కషాలే పాఠాలంటుంది, బేడీలేసిన చేతులతోటే పిడికిలి బిగించి నినదిస్తుంది:-

‟ఏదీ వి.ర.సం. ? ఎక్కడ వి.ర.సం. ?
శిక్షే - కక్షే - విప్లవదీక్షే
కంటి జేగురే పిడికిటి బిగువే
ఎగిరే ఎఱ్ఱపతాకం నగవే !''

'నారా' ఏమన్నాడు ? :-

‟కవిని జైల్లో పెట్టిన రాజు పోతాడు.
కవి వుంటాడు
మనుషులున్నన్నాళ్ళూ,''

''వసంతమూ, సంగీతమూ తుపాకీ తోటాలకూ లాఠీలకూ భయపడి ఆగిపోవు.''

జైలు కోకిల వినిపించిన సంగీతం ఆలోచనలు రేకెత్తిస్తున్నది :-

‟Fled is that music : do I wake or sleep ?'' (Keats).

— జీ. డి.

‟జైలు కోకిల''
కె. వి. రమణారెడ్డి
ఝంఝ ప్రచురణలు
10-6-27 కావలి 524 201
వెల : మూడు రూపాయలు

కల

— యం. టి. ఖాన్

నేడు
నీడలేని అడవులు
వేల పాదాలను ప్రతిధ్వనిస్తున్నాయి
రక్తపు పరిమళాలు
భూమికి ఎరువు కదా !
పండుతాయి తేనె తీగలలో
వెన్నెల మొగ్గలు
నిజమే నాయీ కల.

అరిపిరాల విశ్వం శిథిల కావ్యం :

"హ ళే బీ డు"

శివపాదము నుంచ నేను శిలనైనను కారాదా ?
కైలాసపు సామీ మరల కలనైనను రారాదా ?

అని వ్యధ చెందుతున్న ఈ కవికీ—

శివ శివ శివ యన రాదా
శివ నామము చేదా ?

అని వాదానికి దిగిన మరో కవికీ మధ్యగల భేదం అంతా కలసి ఒక్క సలబై సంవత్సరాల ప్రాయం మాత్రమే కాదు— రక్తి మధ్యే మధ్యే భక్తి సమర్పయామి తత్వం దేవులపల్లి కృష్ణశాస్త్రిది కాగా. అరిపిరాల విశ్వం తత్వం ప్రారంభమే భక్తి. ప్రాయాన్ని బట్టి మాత్రమే విశ్వం యువకుడు. తత్వ కవితతో ప్రారంభించి ఇప్పటికి శివపాదాన్ని ఆశ్రయించి శివసాయుజ్యం అభిలషిస్తున్నాడు. అది ఆయన వేదన— 'జీవుని వేదన' కావచ్చుగాని దాన్ని కావ్యముఖంగా "వేదనా వేదమ్ము" వెలార్చ బూనాడు గనకనే ఇది రాయవలసి వస్తూంది—

సదరు వేదం, అలనాటి హళేబీడు అజ్ఞాత శిల్పినీ నేటి ఈ కవినీ స్పందింప చేసి, అప్పుడేమో శిల్ప "విరచనమ్ము" గానూ మరి ఇప్పుడు అక్షర "విరచనమ్ము" గానూ "సౌందర్యతపము" గా బయల్పడింది.

"హళే బీడున గతము ప్రకృతము
కలిసికొన్నవి నీవు నేనై."—

—అంటాడు శిల్పో కవి. ఆ శిల్పి హళేబీడులో... అందాల బీడులో... ఇప్పుడు భూతమై తిరుగాడు తున్నాడట, ప్రేతాత్మనూ భూతకాలాన్నీ 'భూతం' అనే ఒక్కమాటతో తోపింపజెయ్యడమేకాదు; భూత భవిష్యద్వర్తమానాలను అఖండ స్రవంతిగా భావిస్తూ, "కాలమే సృజనాత్మకిత" అని నిర్వచిస్తాడు- కాబట్టి తన దృష్టిలో, కవిగా తాను కాలాతీతుడు- కావ్యమైనా శిల్పమైనా సౌందర్యమే కాలాతీతమని తాత్పర్యం- అయినందుచేత భూతకాలం గురించి రచించే హక్కు తనకు ఉంది. "నవ్వుకొందురుగాక నాకేటి సిగ్గు ?" అని భావకవిలా తాననుకోవడం లేదు. పైగా—

"కవిత కాదిది, నవత కాదిదీ - మనసు అంచుల మమత యౌనిది-
క్రొత్త ఇతివృత్తమ్ము కాదిది - క్రొత్త వేదన సలుపు నృత్తము"—

అంటాడు కూడా.

"నవత" విషయాన్ని అటుంచి ఇది "కవిత" కూడా కాదని అనుకుంటున్నాడా కవి? కవితను మించిన విషయం కాబట్టి శిల్పిచేసిన తపస్సు "నాదు పుణ్యపు ప్రోవుగా రూపైన" కావ్యమైంది. శిల్పి ఆత్మ, శివునిమూర్తి, తన కవితలో కలిసి దాన్ని "రసగాథ" - "రసాపగ" గా మార్చాయని, తన వాక్కు ధన్యమై పోయిందని సంతృప్తి పడుతున్నాడు.

కథ ఏదీ లేని కావ్యం 'హళే బీడు.' అందులోని శిల్పి విశేషాల్ని వేర్వేరు ఖండికలుగా వర్ణన ప్రధానంగా విడగొట్టి, వీటన్నిటిలోనూ అంతర్లీనంగా ఉన్న సౌందర్యానుభూతి ప్రకటనలుగా రూపొందించడం జరిగింది.

ఇలాంటి కావ్యాలను చూశాక, కాల్పనికవాద సంప్రదాయంలో ముఖ్యాంశమైన వర్ణనా ప్రాగల్భ్యానికి, గత ఘనతను మూర్తీభవించుకొన్న శిల్పాలు బాగా పనికివస్తాయని అనిపిస్తుంది. దీనికి తెలుగులో ఆద్యుడు రాయప్రోలు. తర్వాత విశ్వనాథ, కొడాలి వగైరా. ఆ రోజుల్లో, దేశం పరాధీనమై, భారతదేశంలోని ఆంధ్ర ప్రాంతం ఇరుగు పొరుగులతో కలహిస్తూ ప్రాదేశిక సమగ్రతకు భాషా ప్రాతిపదికను సమకూర్చుకొంటూ ఉండింది. అప్పుడిలాంటి గత 'ప్రశస్తి'కి 'పౌరుషము' అలవడింది. తమ నాటి దేశం "జీవచ్ఛవాంధ్రము" అనిపించింది. అతిశయాలు పోవడం, ఆర్భాటాలు చెయ్యడం, చరిత్రను తారుమారుగా చేస్తూ అభూతకల్పనలకు దిగడం ఈ కవిత్వ వ్యాధి లక్షణాలు.

అక్కడితో ఆగక, దాశరథి, సి నా. రె. లలో ఇది మారాకువేసింది. ఆంధ్రప్రదేశ్ అవతరణను "మహేంద్రోదయం" సూచించింది లెమ్మనుకున్నా, "కర్పూర వసంత రాయలు" ఆధునిక ప్రబంధమైనది. విద్వాన్ విశ్వం "పెన్నేటి పాట" దినుసే వేరు. వెనకటి గుడి గోపురాల గురించీ శిథిలాల గురించీ రాసిన తొలికావ్యం "హళే బీడు" కాదు, సి.నా.రె. రామప్ప గుడి ఒకటి వుంది. అయితే సి.నా.రె. కి రక్తి పరమావధి కాగా, అరిపిరాల విశ్వం రక్తిద్వారా ముక్తిని పొందగోరుతాడు. సినారెలో వేదన లవలేశమైనా లేదు. ఇది వుండి, విశ్వం సాధించిందేమిటనేది ప్రశ్న. తన వేదనకు లోతు లేదు గనకనే ఈ 'శిథిల' కావ్యాన్ని సాధించ గలిగాడు. గోరంత వేదనను కొండంతగా చూపాడు కాబట్టి తాను ఆశించినది వికటించినది. శబ్దాల మీద తాను కాకుండా, తనమీద శబ్దాలకు పెత్తనం ఇచ్చాడు శిథిలాలను వర్ణిస్తూ, తాను "సజీవ శిథిలము" గా మారాడు. చరిత్రగాని, సామాజిక విశేషాలు గాని దరి దాపుల కైనా రాని రాతి బొమ్మల వర్ణనలతో ముని గాడు గాని తేలలేదు.

—రమ

★★

ప్రతి వ్యక్తి ఎప్పుడో ఒకప్పుడు మరణిస్తాడు. కానీ ప్రజల కొరకు జీవించి, ప్రజల కొరకు మరణించిన వ్యక్తి ధన్యుడు పోతే మన చుట్టాలందరికీ ప్రస్తుతం నేను మద్రాసులో ఏదో ఉద్యోగానికి వెళ్ళానని, తర్వాత కొన్ని రోజులకు, ఏదో ప్రమాదం జరిగి చనిపోయిందని చెప్పండి. నా ఫోటోలు కాల్చేద్దామనుకొని కాల్చలేదు. వాటిని జాగ్రత్తగా దాచినాసరే, చింపినాసరే. రమేషు సామాన్లు తీసుకొని బయలుదేరగానే నేను వెళ్ళిపోతున్నాను. నాకోసం విజయవాడకాని, పెనుమాకకాని తిరిగి హైరానాపడవద్దు. నాయనమ్మకు, అమ్మకు నా నమస్కారములు చెప్పండి.

— స్నేహలత.

కృతజ్ఞతలు - క్షమాపణలు

ఆశించిన దానికన్న అత్యధికపాళ్ళలో 'సృజన' పునర్జన్మపట్ల పాఠకుల ఆదరణ, సహకారభావం అందుతున్నవి. అందుకు మా హృదయపూర్వక ధన్యవాదాలు. కాని ఎమర్జెన్సీ అర్ధరాత్రి పొంగివచ్చిన ఏరులా 'సృజన'కు సంబంధించిన ప్రతి విషయాన్నీ తుడిచిపెట్టేసి వేల రూపాయల నష్టానికి గురిచేసింది. ఫలితంగా చాలా కొద్ది కాపీలు మాత్రమే వేయగలిగాం. అందువలన ఆంధ్రప్రదేశ్ అన్నివైపుల నుంచీ వచ్చిన ఎందరో వ్యక్తుల, సంస్థల, ఏజంట్ల ఆర్డర్లకు కాపీలు పంపలేకపోయాము. అందుకు వారందరికీ పత్రికాముఖంగా క్షమాపణలు చెప్పుకుంటున్నాం.

— సాహితీ మిత్రులు.

SRJANA Telugu Monthly Sep. '77 H / WL-10
Regd. No. with Registrar of News Papers 10953 / 67

తండ్రిగారికి రాసిన ఉత్తరం

పూజ్యశ్రీ నాన్నగారికి

సమస్కరించి వ్రాయునది -



విహారు క్షేమమని తలుస్తాను. నేను మీకు ఒక ముఖ్యవిషయం చెప్పదలచు కొన్నాను. ఏమంటే ఇన్నేళ్లు నా జీవితములో నేను అర్థం చేసుకొన్నది, ఈ వ్యవస్థలో, ఈ సమాజంలో ఏ విధముగాను నాలాంటి ఆత్మాభిమానముకల, యేవో కొన్ని ఆదర్శాలున్న వ్యక్తి జీవించటము కష్టము అని.

ఎప్పుడూ అధికారులు అని అనుకొనేవారు అందరూ తమకు అణిగి, మణిగి ఉండాలని అనుకుంటారు. అది నాకు చేతకాదు. అందు చేత నేను రెండు మూడు సంవత్సరాలనుండి ఈ సమాజంలో నాలాంటి వ్యక్తి బ్రతకటం కష్టం అని తెలుసుకొన్నాను. ఎవర్నీ నమ్మలేని ఈ సమాజంలో పెండ్లి చేసుకోలేను. ఉద్యోగం చేయలేను, అని అనుకొన్నాను. అందుచేత నేను ఈ వ్యవస్థలో మార్పు తీసుకొని రావాలను కొనే విప్లవకారులతో కలిసి పోతున్నాను. సామాన్యంగా ఏ విప్లవకారుడు ప్రజా విముక్తి కొరకు ప్రజల్లో జీవించడానికి వెళ్ళేటపుడు ఇంటిదగ్గర చెప్పి వెళ్ళ దను కొంటాను.

కాని మీకు నేను చెపుదామనుకొన్నాను. ఎందుకంటే నేను చదువుకుంటా నంటే చదివించి, నేను ఏది కావాలనుకొన్నా మీకు ఇష్టం లేకపోయినా, అంగీక రించి నా అభివృద్ధికి చాలా సహాయపడ్డారు. ఈనాడు నేను ఈ దారికి పయ నిస్తున్నందుకు మీరు మొదట్లో మమకారాన్ని చంపుకోలేక కొంచెం బాధపడినా, తర్వాత చాలా సంతోషపడతారు. అమ్మతోకూడా చెప్పండి.

(మిగతా 3 వ కవరు పేజీలో)

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu', Printed at Ushasri Printers, Vijayawada, for Venkatramana Mudranalayam, Warangal.
Working Editor Varavara Rao.